# 18 నిమిషాలకో రేప్!

(మొదటి తరువాయి)



మంది మహిళలపై నేరాలు చోటు చేసుకొంటున్నాయి. ఈ మేరకు ఇటీవల విడుదలైన జాతీయ నేర గణాంక విభాగం (ఎన్సీఆర్బీ-2024) నివేదిక కీలక విషయాల్ని వెల్లడించింది

మహిళలకు భద్రత ఎక్కడ?

ఎక్కడైతే మహిళలు గౌరవించబడతారో అక్కడ దేవతలు విహరిస్తారని అంటారు. అయితే, బీజేపీ పాలనలో దేశంలో మహిళలకు రక్షణ లేకుండా పోయింది. 2024 ఒక్క ఏడాదిలోనే దేశవ్యాప్తంగా 4,41,534 మంది మహిళలపై దాడులు, అఘాయిత్యాలు జరిగాయి. మహిళలపై నేరాల్లో బీజేపీపాలిత రాష్ట్రాలు టాప్-3 స్థానాల్లో ఉండటం గమనార్హం. 66,396 కేసులతో ఉత్తరప్రదేశ్ అగ్రస్థానంలో ఉండగా, 47,954 కేసులతో మహారాష్ట్ర రెండో స్థానంలో, 36,536 కేసులతో రాజస్థాన్ మూడో స్థానంలో నిలిచింది. మహిళలపై నేరాల్లో హత్యలు, లైంగిక దాడులు, లైంగిక వేధింపులు, కిడ్నాప్‌లు, గృహహింస, వరకట్న వేధింపులు తదితరాలు ప్రధానంగా ఉన్నాయి.

బీజేపీపాలిత రాష్ట్రాలే టాప్

దేశంలో 2024 ఏడాదిలో మొత్తంగా 29,536 రేప్ కేసులు నమోదయ్యాయి. మహిళలపై లైంగిక దాడుల్లో బీజేపీపాలిత రాష్ట్రాలే టాప్-5 స్థానాల్లో ఉన్నాయి. రాజస్థాన్‌లో అత్యధికంగా 4,871 రేప్ కేసులు నమోదుకాగా, తర్వాతి స్థానాల్లో వరుసగా ఉత్తరప్రదేశ్ (3,209), మహారాష్ట్ర (3,091), మధ్యప్రదేశ్ (3,061), హర్యానా (1,391) ఉన్నాయి.

తెలిసినవారే కారకులు

మహిళలపై జరిగే ప్రతీ 100 లైంగిక దాడుల్లో 97 కేసుల్లో నిందితులు బాధిత మహిళకు తెలిసిన వారే ఉంటున్నారని ఎన్సీఆర్బీ నివేదిక తెలిపింది. 2024లో నమోదైన మొత్తం 29,536 రేప్ కేసుల్లో 28,597 కేసుల్లోని నిందితులు బాధితురాళ్లకు తెలిసినవారుగా ఉన్నట్టు వెల్లడించింది. ఘాతుకానికి పాల్పడిన వారిలో 2,134 కేసుల్లో కుటుంబసభ్యులు, 13,879 కేసుల్లో స్నేహితులు, మాజీ భర్తలు, 12,584 కేసుల్లో ఫ్యామిలీ ఫ్రెండ్స్, ఇరుగుపొరుగు, సహోద్యోగులు ఉన్నట్టు తెలిసింది.

2024లో మహిళలపై నేరాలు ఇలా..

మొత్తం నేరాలు: 4,41,534
భర్త, అత్తింటివారి వేధింపులు: 1,20,227
కిడ్నాప్‌లు: 67,829
పోక్సో కేసులు: 67,809
లైంగిక వేధింపులు: 48,303
రేప్‌లు: 29,536
ఇతర నేరాలు: 1,07,830

## తల్లి పాలే శిశువుకు తొలి టీకా

(మొదటి తరువాయి)

వయస్సుకు తగిన అనుబంధ ఆహారంతో పాటు రెండేళ్లు తల్లిపాలను కొనసాగించడం ద్వారా పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు బలమైన పునాది ఏర్పడుతుందని మంత్రి చెప్పారు.

తల్లి పాల వారోత్సవాలను కేవలం అధికారిక కార్యక్రమాలుగా కాకుండా ప్రజల్లో చైతన్యం కలిగించే ఉద్యమంగా నిర్వహించాలని మంత్రి సీతక్క సూచించారు. రాష్ట్రంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలు, గ్రామాలు, వార్డుల్లో అవగాహన సమావేశాలు, ఇంటింటి సందర్శనలు, కమ్యూనిటీ కార్యక్రమాలు నిర్వహించి తల్లిపాలపై విస్తృత ప్రచారం చేపట్టాలని ఆదేశించారు.

అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు, సూపర్‌వైజర్లు, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, ఆశా కార్యకర్తలు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సమన్వయంతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులను సందర్శించి గర్భిణీలు, బాలింతలు, ఆరు నెలల లోపు శిశువుల తల్లులు, రెండేళ్ల లోపు పిల్లల తల్లులకు ప్రత్యేక కౌన్సెలింగ్ ఇవ్వాలని మంత్రి సూచించారు. తల్లిపాలపై ఉన్న అపోహలను తొలగిస్తూ శాస్త్రీయ అవగాహన కల్పించాలని, కుటుంబ సభ్యులను కూడా ఈ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని కోరారు. ప్రసవం జరిగిన ప్రతి ఆసుపత్రిలో పుట్టిన గంటలోనే శిశువుకు తల్లిపాలు అందేలా వైద్య సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని మంత్రి ఆదేశించారు. తల్లి పాల ప్రోత్సాహంలో అంగన్వాడీ వ్యవస్థ కీలక పాత్ర పోషించాలని, ప్రతి అంగన్వాడీ కేంద్రం తల్లి శిశు ఆరోగ్యానికి మార్గదర్శక కేంద్రంగా నిలవాలని ఆకాంక్షించారు.

పోషకాహార లోపం లేని తెలంగాణ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి శిశువుకు ఆరోగ్యవంతమైన జీవితానికి తల్లి పాలే బలమైన పునాది అని అన్నారు.

ప్రపంచ తల్లి పాల వారోత్సవాలను విజయవంతం చేయడంలో ప్రజాప్రతినిధులు, వైద్యులు, మహిళా సంఘాలు, అంగన్వాడీ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు, ప్రతి కుటుంబం భాగస్వాములు కావాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. ప్రతి తల్లి తన బిడ్డకు తల్లిపాలు అందించేలా సమాజమంతా బాధ్యతతో ముందుకు రావాలని కోరారు.

## చట్టంగా మారిన యాంటీ పేపర్ లీక్ బిల్లు

న్యూఢిల్లీ/



దేశంలో పేపర్ లీకేజీలను అరికట్టేలా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యాంటీ పేపర్ లీక్ అమెండ్‌మెంట్ బిల్లును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శనివారం ఆమోదించారు. దీంతో ఇకపై ఈ బిల్లు చట్టంగా అమలులోకి రానుంది. 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) అమెండ్‌మెంట్ బిల్, 2026' పేరుతో రూపొందిన ఈ బిల్లును ఈ వారంలోనే పార్లమెంట్ ఆమోదించింది. అటు లోక్‌సభలో చర్చ అనంతరం ఆమోదం పొందగా, మరుసటి రోజు రాజ్యసభలో కూడా ఆమోదం లభించింది. దీంతో వెంటనే ఈ బిల్లు ఆమోదం కోసం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వద్దకు పంపింది ప్రభుత్వం.ఇటీవల నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా సీజేపీ ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగిన ఆందోళన గురించి తెలిసిందే. ఈ ఉద్యమం నేపథ్యంలో కేంద్రం పేపర్ లీకేజీలను అరికట్టేలా కొత్త బిల్లును తీసుకొచ్చింది. ఇదే అంశంలో 2024లో తెచ్చిన బిల్లుకు సవరణలు తెస్తూ కొత్త బిల్లును ప్రవేశపెట్టింది. ఈ బిల్లును కాంగ్రెస్ సహా అనేక ప్రతిపక్షాలు వ్యతిరేకించాయి. ఈ బిల్లు ద్వారా పూర్తిస్థాయిలో పేపర్ లీకేజీలను అరికట్టలేమని ప్ర తిపక్షాలు వ్యాఖ్యానించాయి. అయితే, పేపర్ లీకేజీలను అడ్డుకునేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందువల్లే కొత్త బిల్లును రూపొందించామని కేంద్రం సమర్థించుకుంది. కొత్త బిల్లు ప్రకారం పేపర్ లీకేజీకి పాల్పడితే కఠిన శిక్షలు, జరిమానాలు విధిస్తారు. ఈ బిల్లులోని ప్రధానాంశాలివి.

పేపర్ లీకేజీ కేసులను విచారించేందుకు ప్రతి రాష్ట్రంలో ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేస్తారు. 90 రోజుల్లోనే విచారణ పూర్తి చేసి, శిక్షలు విధించేలా ఈ కోర్టులు నిరంతరం పని చేస్తాయి. పాత బిల్లు ప్రకారం పేపర్ లీకేజీకి పాల్పడితే వ్యక్తిగతంగా రూ.10 లక్షల వరకు జరిమానా విధించేవారు. కొత్త బిల్లు ప్రకారం రూ.50 లక్షల వరకు జరిమానా విధిస్తారు. ఒకవేళ సంస్థలు, వ్యవస్థీకృతంగా నేరానికి పాల్పడితే రూ.10 కోట్ల వరకు జరిమానా విధిస్తారు. అలాగే, గతంలో గరిష్ఠంగా మూడేళ్ల నుంచి ఐదేళ్ల వరకు శిక్ష విధించేవారు. ఇప్పుడు ఐదు నుంచి పదేళ్ల వరకు జైలు శిక్ష విధిస్తారు. ఇంతకుముందు కేంద్ర దర్యాప్తు సంస్థలు పేపర్ లీకేజీ కేసులపై విచారణ జరిపేది. కానీ, ఇకపై స్పెషల్ టాస్క్‌ఫోర్స్ టీంలు ఈ కేసుల్ని విచారిస్తాయి. గతంలో పేపర్ లీకేజీ కేసుల విచారణకు కాల పరిమితి అంటూ లేదు. కొత్త బిల్లు ప్రకారం ఈ కేసుల విచారణను రెండు నెల్లో పూర్తి చేయాలి.

# ధరణి అక్రమాలపై ఉక్కుపాదం

(మొదటి తరువాయి)

భారీ స్థాయిలో భూ అక్రమాలు, అక్రమ మ్యుటేషన్లు, ప్రభుత్వ భూముల బదిలీలు జరిగాయని అన్నారు. ప్రస్తుతం ప్రతి వ్యవహారాన్ని ఆధారాలతో సహా పరిశీలిస్తున్నామని, నిజాలను ప్రజల ముందుంచుతామని తెలిపారు. అంతేగాక ఎవరి హయాంలో ఎంత భూమి నిషేధిత జాబితాలో చేరిందో తేలుస్తామన్నారు. తాము అధికారంలోకి వచ్చినప్పుడు నిషేధిత జాబితాలో ఎంత భూమి ఉంది? ఆ భూములను ఎవరు, ఎప్పుడు, ఏ కారణాలతో చేర్చారు? తర్వాత ఎందుకు తొలగించారు? అనే ప్రతి అంశంపై సమగ్ర విచారణ జరుగుతోందన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను కూడా అదే స్థాయిలో పరిశీలిస్తున్నామని స్పష్టం చేశారు. కొత్తగా ఒక్క సెంటు భూమి కూడా నిషేధిత జాబితాలో చేర్చలేదు. ప్రస్తుత ప్రభుత్వం కొత్తగా అంగుళం భూమిని కూడా నిషేధిత జాబితాలో చేర్చలేదని మంత్రి స్పష్టం చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు ధరణి పోర్టల్‌లో ఉన్న జాబితానే కోర్టుకు సమర్పించామని, వివాదాలు లేని ప్రైవేట్ ఆస్తులు లేదా ప్లాట్లను ప్రభుత్వం నిషేధిత జాబితాలో చేర్చిందన్న ప్రచారం పూర్తిగా అసత్యమని పేర్కొన్నారు.

రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో ప్రభుత్వం రీసర్వే చేపట్టిందని తెలిపారు. ఇప్పటికే 276 గ్రామాల్లో సర్వే పూర్తయిందని, ప్రతి సర్వే నంబరుకు ఆధార్ తరహాలో ప్రత్యేక భూధార్ నంబర్ కేటాయిస్తామని చెప్పారు. ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని, కేవలం రెండు శాతం మాత్రమే అభ్యంతరాలు వచ్చాయని వివరించారు. రాష్ట్రంలో సుమారు 85 వేల ఎకరాల అసైన్డ్ భూములు ఉన్నాయని, వాటి విషయంలో సమగ్ర విధాన నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అన్ని కోణాల్లో ప్రభుత్వం చర్చిస్తోందని తెలిపారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో ఎలాంటి రాజీ ఉండేదని, ఎవరికీ అనుకూలంగా లేదా వ్యతిరేకంగా వ్యవహరించే ప్రశ్నే లేదని మంత్రి స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారమే ప్రతి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. క్యూఆర్ పరిధిలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ టవర్లను చూసి బీఆర్ఎస్ నాయకులు జీర్ణించుకోలేక విమర్శలు చేస్తున్నారని మంత్రి విమర్శించారు. కొల్లాపూర్ లో గత ప్రభుత్వం నిర్మించిన 2బీహెచ్‌కే ఇళ్లలో వర్షం వస్తే నీళ్లు కారుతున్నాయని మీడియా దృష్టికి వచ్చిన విషయాన్ని ప్రస్తావిస్తూ, అది గత ప్రభుత్వ నాణ్యతకు నిదర్శనమని ఎద్దేవా చేశారు. అయినప్పటికీ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆ ఇళ్లను కూడా మరమ్మతులు చేయిస్తామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లకు కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోయినా, లబ్ధిదారులు ఇబ్బంది పడకుండా రాష్ట్ర ప్రభుత్వమే ఫైనల్ బిల్లులు చెల్లిస్తుందని మంత్రి ప్రకటించారు. భూముల మార్కెట్ విలువల సవరణ తర్వాత ప్రభుత్వం అంచనా వేసిన దానికంటే 10 నుంచి 20 శాతం వరకు అధిక ఆదాయం వచ్చిందని మంత్రి తెలిపారు. స్టాంప్స్ ౘ రిజిస్ట్రేషన్స్ శాఖ ఆదాయం కూడా గణనీయంగా పెరిగిందన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు వార్షిక ఆదాయం సుమారు రూ. 13 వేల కోట్లు ఉండగా, గత ఏడాది అది రూ. 15 వేల కోట్లకు చేరిందని, ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 18 వేల కోట్లకు చేరుకునే అవకాశం ఉందని వెల్లడించారు. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల సంఖ్య కూడా గణనీయంగా పెరిగిందని మంత్రి పొంగులేటి తెలిపారు.

# అమెరికా వీసా బాంబ్

- వాణిజ్య, టూరిస్టు వీసాలకు బాండ్ ప్రోగ్రామ్
- 20 వేల డాలర్లు చెల్లిస్తేనే వీసాలు
- 50 దేశాలకు ట్రంప్ సర్కార్ షాక్
- గడువు ముగిసేలోగా అమెరికా విడిచివెళ్లాలి
- లేదంటే బాండ్ డిపాజిట్ ఫ్రీజ్
- రేపటి నుంచి అమల్లోకి




వాషింగ్టన్:

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ మరో పిడుగులాంటి వార్త చెప్పారు. తాజాగా 50 దేశాలపై వీసా బాండ్ బాంబ్ పేల్చారు. వ్యాపారం కోసం ఇచ్చే బీ-1, టూరిస్టులకు జారీ చేసే బీ-2 వీసాల జారీకి శాశ్వత వీసా బాండ్ ప్రోగ్రామ్‌ను ట్రంప్ యంత్రాంగం తీసుకువచ్చింది. దీని కింద ఆయాదేశాలకు చెందిన పర్యాటకులు 20 వేల డాలర్ల బాండ్ సమర్పించాల్సి ఉంటుంది. యూఎస్ వీసాబాండ్ ప్రోగ్రామ్ ముందుగా పైలట్ కార్యక్రమంగా ప్రారంభమైంది. తాజాగా అమెరికా ప్రభుత్వం దీనికి కొన్ని మార్పులు చేసి విస్తృత స్థాయిలో అమల్లోకి తీసుకువస్తోంది.

50 దేశాల నుంచి వ్యాపారం, టూరిజం వంటి పనుల కోసం వచ్చే సందర్శకులు ముందు కొంత మొత్తాన్ని డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. కొత్త నిబంధనలు ఆగస్టు 3 నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ ప్రోగ్రామ్ వల్ల వీసా గడువు ముగిసినా దేశంలోనే ఉండేవారి సంఖ్య గణనీయంగా తగ్గుతుందని విదేశాంగ శాఖ తెలిపింది. దీనిని శాశ్వతంగా అమలు చేయాలని నిర్ణయించారు. ఫెడరల్ రిజిస్టర్ నోటీస్ ప్రకారం పైలట్ ప్రోగ్రామ్ కింద ఎంపిక చేసిన దరఖాస్తుదారులు బాండ్ రూపంలో డిపాజిట్ చేస్తే మొత్తం 5వేల డాలర్లు, 10 వేల డాలర్లు, గరిష్టం మొత్తం 15 వేల డాలర్లుగా ఉంది. తుది నిబంధనల్లో 5వేల డాలర్ల ఆప్షన్ తొలగించారు. గరిష్ట మొత్తాన్ని 20 వేల డాలర్లకు పెంచారు. వీసా ఓవర్ స్టే ఎక్కువ ఉన్న 50 దేశాల పౌరులకు ఈనిబంధనలు వర్తిస్తాయి. ఈ జాబితాలో ఆఫ్రికా, ఆసియా, దక్షిణ అమెరికా దేశాలు ఉన్నాయి. ఈ బాండ్ పరిధిలోకి వచ్చే ప్రయాణికులు కేవలం కమర్షియల్ విమానాల్లోనే ప్రయాణించాల్సి ఉంటుంది. వీసా తిరస్కరణకు గురైతే నిర్దేశిత గడువులోగా అమెరికాలో పనులు ముగించుకుని వెళ్లిన సమయంలో ఈ బాండ్ మొత్తం రీఫండ్ అవుతుంది. వీసా గడువు దాటినా అక్కడే ఉంటే ఈ మొత్తాన్ని ప్రభుత్వం ఫ్రీజ్ చేస్తుంది.

# నేడు లష్కర్ బోనాలు..

నేడు లష్కర్ బోనాలు.. రేపు రంగం
-ఉజ్జయినీ మహంకాళి జాతరకు భారీ ఏర్పాట్లు
-ఉదయం 3.30 గంటలకు ప్రభుత్వ బోనం సమర్పణ
-భక్తుల దర్శనానికి ప్రత్యేక క్యూలైన్లు
-బోనాలు సమర్పించే మహిళలకు ప్రత్యేక ఏర్పాట్లు
-వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక కేంద్రాలు
-భద్రతా విధుల్లో 1500 మంది పోలీసులు
-అంబారీపై అమ్మవారి ఊరేగింపుతో ముగింపు వేడుకలు



బేగంపేట్,

: సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయినీ మహంకాళి బోనాల జాతర ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఆగస్టు 2 ఆదివారం అమ్మవారికి బోనాలు, 3న రంగం, అంబారీపై అమ్మవారి ఊరేగింపు కార్యక్రమాలు ఉంటాయని ఈవో గుత్తా మనోహర్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వం తరపున ఉదయం 3.30 అమ్మవారికి బోనం సమర్పించిన అనంతరం 4 గంటల నుంచి భక్తులు దర్శించుకునేందుకు, బోనాలు సమర్పించేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు.అమ్మవారిని దర్శించుకోవడానికి వచ్చే సాధారణ భక్తులకు మూడు క్యూలైన్‌లు, అలాగే బోనాల సమర్పించే మహిళలకు వేరుగా 2 క్యూలైన్‌లు ఏర్పాటు చేశారు. అలాగే వీఐపీ లకు కూడా మరో క్యూలైన్‌లు ఏర్పాటు చేశారు. వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక సెంటర్లను ఏర్పాటు చేశారు. బందోబస్తులో సుమారు 15 వందల మంది పాల్గొంటున్నట్టు పోలీస్ అధికారులు తెలిపారు.

## నల్ల చెరువు పునరుజ్జీవంలో హైడ్రా శ్రమ

(మొదటి తరువాయి)

అని పేర్కొన్నారు. ప్రతి చెరువును కాపాడుతూ... ప్రజల ఆస్తిని సంరక్షిస్తూ ముందుకు సాగుతామని ఆయన భరోసా ఇచ్చారు. కొత్త శిఖరాలను అధిరోహిస్తున్న తెలంగాణరాష్ట్రంలో తమ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ కొత్త శిఖరాలను అధిరోహిస్తూ సరికొత్త విజయాలను సాధిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దేశంలోనే అత్యుత్తమ పని తీరును ప్రదర్శిస్తోందని ట్వీట్ ద్వారా తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో తలసరి ఆదాయం రూ. 4,18,931గా నమోదయ్యిందనీ, ఇది గతేడాది రూ. 3,80,031గా ఉందని గుర్తు చేశారు. ఒకే సంవత్సరంలో తాము 10.23 శాతం వృద్ధిని సాధించామనీ, ఇది రూ. 38,900 పెరుగుదల అని తెలిపారు. కఠోర శ్రమ, ఆర్థిక వృద్ధిపై దృష్టి, పెట్టుబడులు, ఉద్యోగాల కల్పన, అన్ని రంగాలలో సమతుల్య అభివృద్ధి, తాత్కాలిక విధానాల నుంచి విధాన ఆధారిత పాలనకు మారడం, శ్రద్ధతో కూడిన పని, నిరంతర సమీక్షలు, వివరాలపై శ్రద్ధ, భాగస్వాములతో నిరంతరం సంప్రదింపులు చేయడం ద్వారా ఇది సాధ్యమైందని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం... గత దశాబ్దకాలపు వైఫల్య పాలనను, నిరాశావాద వాతావరణాన్ని తిప్పికొట్టి, ప్రతి పౌరునిలో ఆశావాదాన్ని, నమ్మకాన్ని నింపిందని వివరించారు. తమ విజయానికి మహిళలు, రైతులు, యువత అతిపెద్ద లబ్దిదారులని తెలిపారు. రాబోయే కాలంలో రాష్ట్రం మరింత గొప్ప విజయాలను సాధిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## పోలీస్ రిక్రూట్మెంట్ దరఖాస్తు తేదీల ఖరారు

(మొదటి తరువాయి)

ఆన్‌లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. గత నెల 29న విడుదల చేసిన నాలుగు వేర్వేరు నోటిఫికేషన్ల ద్వారా మొత్తం 7,437 పోస్టులను భర్తీ చేయనున్నామని, దరఖాస్తులు కేవలం అధికారిక వెబ్‌సైట్ ద్వారా మాత్రమే స్వీకరించబడతాయని, ఇతర మార్గాల్లో వచ్చిన దరఖాస్తులను తిరస్కరిస్తామని స్పష్టం చేశారు. సివిల్, రిజర్వ్, ఎస్‌పిఎఫ్ ఎస్సై, స్టేషన్ ఫైర్ ఆఫీసర్, డిప్యూటీ జైలర్ పోస్టులకు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.750, ఇతర అభ్యర్థులకు రూ.1,500 ఫీజు నిర్ణయించారు. అసిస్టెంట్ సబ్‌ఇన్‌స్పెక్టర్ (ఫింగర్ ప్రింట్ బ్యూరో) పోస్టులకు కూడా ఇదే ఫీజు వర్తిస్తుంది. ఈ పోస్టులకు ప్రత్యేక సాంకేతిక పరీక్ష నిర్వహిస్తారు. సివిల్, ఎఆర్, ఎస్‌ఆర్‌సిపిఎల్ పోలీస్ కానిస్టేబుల్, ఎస్‌పిఎఫ్ కానిస్టేబుల్, ఫైర్ ఫైటర్, జైలు వార్డర్ పోస్టులకు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.600, ఇతరులకు రూ.1,200 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. పోలీస్ కానిస్టేబుల్ డ్రైవర్, మెకానిక్ పోస్టులకు కూడా ఇదే ఫీజు వర్తిస్తుంది. అయితే వీరికి అదనంగా డ్రైవింగ్ టెస్ట్ లేదా ట్రేడ్ టెస్ట్ నిర్వహిస్తారు.ఒక అభ్యర్థి ఒకటి కంటే ఎక్కువ నోటిఫికేషన్లు లేదా పోస్టులకు దరఖాస్తు చేసినా, శారీరక కొలతలు (పిఎంటీ), శారీరక సామర్థ్య పరీక్ష (పిఇటి) ఒక్కసారి మాత్రమే నిర్వహిస్తారు. ఆ పరీక్షల ఫలితాలను అభ్యర్థి దరఖాస్తు చేసిన అన్ని పోస్టులకు వర్తింపజేస్తారు. అదేవిధంగా ఒకటి కంటే ఎక్కువ కామన్ ప్రొసీజర్ రెజిమెంట్లకు దరఖాస్తు చేసిన అభ్యర్థులకు ఫీజులో రాయితీ కూడా కల్పించారు. ఓసి, బిసి అభ్యర్థులకు ప్రతి అదనపు రెజిమెంట్‌పై రూ.100, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.50 చొప్పున తగ్గింపు లభిస్తుంది.

ఆధార్ ఫేస్ అథెంటికేషన్ తప్పనిసరి దరఖాస్తు చేసుకునే ముందు అభ్యర్థులు తమ మొబైల్ ఫోన్లలో ఆధార్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఫేస్ అథెంటికేషన్‌కు సిద్ధంగా ఉండాలని టిఎస్‌ఎల్‌పిఆర్‌బి సూచించింది. దరఖాస్తు అనంతరం ప్రింట్ కాపీని భద్రపరుచుకోవాలని తెలిపింది.

## పన్నుల వాటా కింద రూ.1.09 లక్షల కోట్ల విడుదల

న్యూఢిల్లీ,



రాష్ట్రాల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడం, మౌలిక వసతుల కల్పనతో పాటు అభివృద్ధి పనులకు కేంద్రం నిధులు విడుదల చేసింది. పన్నుల వాటా కింద రాష్ట్రాలకు నిధులను కేటాయించింది. మొత్తం రూ. 1,09,019 కోట్లను విడుదల చేసింది. మూలధన, అభివృద్ధి పనులను వేగవంతం చేసేందుకు ముందస్తుగా నిధుల విడుదల చేసినట్లుగా వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్‌కి రూ. 4597 కోట్లను, తెలంగాణకు రూ. 2,370 కోట్ల నిధులు విడుదల అయ్యాయి. అత్యధికంగా యూపీకి రూ. 19,208 కోట్లు, బీహార్‌కి రూ. 10,845 కోట్లను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. రాష్ట్రాల ఆర్థిక స్థితిని మరింత బలపరిచేందుకు.. మౌలిక వసతులు, అభివృద్ధి పనులకు నిధుల కొరత రాకుండా చూసేందుకు రాష్ట్రాలకు ఈ నిధులు విడుదల చేసినట్లుగా వెల్లడించింది. పన్నుల వాటా కింద రాష్ట్రాలకు రూ. 1,09,019 కోట్లు విడుదల అయ్యాయి. సాధారణంగా ప్రతీ నెలా పదో తేదీలోపు ఈ నిధులను విడుదల చేస్తారు. అయితే గడువు కంటే ముందే కేంద్ర ప్రభుత్వం ఈ అదనపు వాటాను విడుదల చేసింది. దీనివల్ల రాష్ట్రాల వద్ద నిధుల లభ్యత పెరుగుతుందని.. అభివృద్ధి, సంక్షేమ పథకాలు సజావుగా ముందుకు సాగే అవకాశం కలుగుతుందని పేర్కొంది.

## ఇండో-చైనా సరిహద్దు వాణిజ్యం షురూ

(మొదటి తరువాయి)

కార్యక్రమం జరిగింది. రెండు పొరుగు దేశాల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 14 వేల అడుగులకు పైగా ఎత్తులో ఉన్న ఈ వ్యూహాత్మక పర్వత మార్గం ద్వారా కాలానుగుణ వాణిజ్యం తిరిగి ప్రారంభమైంది.

సిక్కిం వాణిజ్య పరిశ్రమల శాఖ కార్యదర్శి కర్మ డి యోట్సో ఈ పునఃప్రారంభాన్ని ప్రకటిస్తూ ప్రస్తుతం ద్విపాక్షిక వాణిజ్య ప్రోటోకాల్ ప్రకారం నవంబర్ వరకు సోమవారం నుంచి గురువారం వరకు కాలానుగుణ వాణిజ్యం జరుగు తుందని చెప్పారు. ఈ సంవత్సరం 38 మంది నమోదిత వ్యాపారులకు వాణిజ్య పాస్లు జారీ చేశారు. చేనేత ఉత్పత్తులు, సాంప్రదాయ, ధార్మిక వస్తువులు, రెడీ మేడ్ వస్త్రాలు, ఇతర ఆమోదించబడిన వస్తువులు సహా 36 నోటిఫైడ్ అంశాలు ఈ మార్గం ద్వారా వ్యాపారం చేయబడ తాయి. ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ను అమలు చేస్తూ విస్తృత భద్రతా ఏర్పాట్లు చేసింది. నాథు లా వద్ద అదనపు సిబ్బంది మోహరించారు. మొదటిసారి మహిళా ప్లాటూన్ కూడా ఉంది. ఇది నమోదిత వ్యాపారులు, రవాణా ఆపరేటర్లు, సరిహద్దు వాణిజ్యంపై ఆధారపడిన ఇతర వాటాదారులకు వ్యాపారం కల్పించడం ద్వారా స్థానిక ఆర్థిక వ్యవస్థకు కొత్త ఉత్సాహం ఇస్తుందని అంచనా.

రోజుకు రూ. 2 లక్షల వ్యాపారం

ప్రతి వ్యాపారి రోజుకు రెండు లక్షల రూపాయల విలువైన వస్తువులను వ్యాపారం చేయవచ్చు. గేట్ ఉదయం 7.30 గంటలకు తెరుచుకుంటుంది. నాథు లా ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్ట్ ని మౌలిక సదుపాయాలు దీర్ఘకాలిక మూసివేత, కఠినమైన హిమాలయ శీతాకాలాల కారణంగా కనుమరుగై పోయాయి. వాటిని పునరుద్ధరించి పనిచేసేలా చేశారు. ఈ పునఃప్రారంభం సిక్కింలోని సుమారు 600 మంది నమోదిత వ్యాపారులకు జీవనోపాధి పునరుద్ధరణగా ఉంటుంది. ఇది గల్వాన్ సంఘటన తర్వాత రెండు అణు శక్తుల మధ్య సంబంధాలలో సాధారణ జీవించే విస్తృత ప్రయత్నాలలో భాగంగా చూడబడుతోంది.

40 ఏళ్లు మూసివేత.. 2006లో పునఃప్రారంభం

1962 భారత్-చైనా యుద్ధం తర్వాత నాలుగు దశాబ్దాలకు పైగా మూసి వేయబడిన నాథు లా 2006లో సరిహద్దు వాణిజ్యం కోసం తిరిగి తెరవబడింది. ఇది రెండు దేశాల మధ్య నియమించబడిన సరిహద్దు వాణిజ్య కేంద్రాలలో ఒకటి. సాంప్రదాయకంగా ప్రతి సంవత్సరం మే నుంచి నవంబర్ వరకు పనిచేస్తుంది. భారత్ వైపు షేరాథాంగ్ ట్రేడ్ మార్ట్ చైనా వైపు రించెన్ గాంగ్ ట్రేడ్ మార్ట్ను కలుపుతుంది. నమోదిత వ్యాపారులు ఆమోదించబడిన స్థానిక ఉత్పత్తులను మార్పిడి చేసుకుంటారు.

# రాయిన్ పల్లి చెరువు గురించి మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి మాట్లాడటం విడ్డూరంగా ఉంది

**- మెదక్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గంగాధర్.. మెదక్**



**మెదక్ ఆగస్టు 01నవ సంఘర్షణ**
మెదక్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మార్గం నాగరాజు, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈగ రాజు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి రాయిన్ పల్లి విషయంలో మాట్లాడం విడ్డూరంగా ఉందని హేళన చేశారు. 10 సంవత్సరాల టిఆర్ఎస్ పాలనలో రాయిన్ పల్లి ధోని కట్ట మరియు బ్రిడ్జ్ గుర్తుకు రాలేదా అని ఎద్దేవా చేశారు. రాయినపల్లి బ్రిడ్జ్ కుంగిపోవడానికి కారణం అప్పటి బి ఆర్ ఎస్ ప్రభుత్వమే అని వందల కొద్ది ట్రాక్టర్లతో రాయిన్ పల్లి కాల్వలో మరియు బ్రిడ్జ్ పరిసర ప్రాంతాల్లో ఇసుక దోపిడీ చేసిన కారణంగానే ఆ బ్రిడ్జి కుంగిపోవడం జరిగిందని దానికి బాధ్యత పది సంవత్సరాల పరిపాలనలో ఉన్న పద్మాదేవేందర్ రెడ్డి బాధ్యత వహించాలని గుర్తు చేశారు. మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ తక్షణమే స్పందించి మంత్రులతో అధికారులతో మాట్లాడి ఇటు రైతులకు అటు ప్రజలకు ఇబ్బంది కాకుండా 2.31 కోట్ల రూపాయలు మంజూరీకి ప్రయత్నాలు ముమ్మరంగా చేస్తున్నారని తెలిపారు. తాను స్థాపించిన యం యస్ యస్ ఓ స్వచ్ఛంద సంస్థ ద్వారా నిధులు సమకూరుస్తూ గ్రామాలు, ఇటు పట్టణాల అభివృద్ధికి బాటలు వేస్తున్నారు. యువకుడు ప్రజలేనా ప్రాణం అంటూ నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో తీసుకుపోతున్నటువంటి యువ ఎమ్మెల్యే పట్ల అనుచిత వ్యాఖ్యలు చేస్తే నియోజకవర్గ ప్రజలు మీకు తగిన శాస్తి చేస్తారని గుర్తు చేశారు. ఎక్కడ కూడా అవినీతికి తాళి లేకుండా ప్రజా పాలన కొనసాగించడంలో ఎమ్మెల్యే కృత నిశ్చయంతో ముందుకు దూసుకుపోతున్నారు, మీ పరిపాలనలో పది సంవత్సరాల పరిపాలనలో ఇసుక దోపిడీ, అసైన్డ్ భూములు, నిధులు స్వాహా నియోజకవర్గాన్ని అభివృద్ధికి దూరం చేసింది మీరు కాదా అని ప్రశ్నించారు.నియోజకవర్గంలో ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటూ ఏడుపాయల దేవస్థానం అయితే నేమి, కాకతీయుల కాలం నాటి ఖిల్లా అయితే నేమి, ప్రఖ్యాతి చెందిన మెదక్ చర్చికి అయితే నేమి నిధులు కేటాయించి అభివృద్ధికి పునాదులు వేస్తున్నది నిజం కాదా ఈ అభివృద్ధి మీ కళ్ళకు కనిపిస్తలేదా అని ప్రశ్నించారు.మెదక్ ప్రాంతాన్ని,, టూరిజం హబ్ గా తీర్చడానికి ఎమ్మెల్యే రోహిత్ నిరంతరం కృషి చేస్తున్నారని గుర్తు చేశారు.మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి ఖబర్దార్ అనవసరంగా ఆణిముత్యం లాంటి యువ ఎమ్మెల్యే పట్ల అనవసరంగా మాట్లాడితే ప్రజాక్షేత్రంలో మీరు దోషిగా మారుతారు తప్ప మిగిలేది ఏమీ ఉండదని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో మెదక్ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు మామిడి యాదగిరి గౌడ్, తిమ్మా నగర్ సర్పంచ్ యాదగిరి, మంబోజి పల్లి సర్పంచ్ మానస రాములు, ఖాజిపల్లి సర్పంచ్ కొంగరి యాదగిరి. సీనియర్ కాంగ్రెస్ నాయకులు బుదయ్య, నర్సింలు, యాదగిరి, చింతల వెంకట్, విజయ్, సాయిబాబా, యం యస్ యస్ ఓ నాయకులు మధు పటేల్, చింతకింది. మల్లయ్య తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇస్లాంపుర లో నూతన రేషన్ షాపు ప్రారంభం



**దేవరకొండ ఆగస్టు 01నవ సంఘర్షణ**
శనివారం 3వ వార్డ్ ఇస్లాంపుర కాలనీలో కొత్త రేషన్ షాప్ మంజూరు అయినది డీలర్ ఉమెన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే బాలునాయక్ ముస్లిం మైనార్టీలకు కొత్త రేషన్ షాప్ ఇస్లాంపురా కు ఇచ్చినారు అని తెలిపారు. గత పాలకులు ఎవరు మైనార్టీ కి రేషన్ షాప్ ఇవ్వలేదు. కాంగ్రెస్ పార్టీ హయాంలో బాలు నాయక్ నాయకత్వం దేవరకొండ టౌన్ లో మొన్న జూన్లో లో రెండు మైనార్టీ వర్గానికి రేషన్ షాప్లు మంజూరు చేసినారు. మైనార్టీ మత పెద్దలు తరపున మైనార్టీ సోదరుల తరపున ఎమ్మెల్యే బాలు నాయక్ కి కృతజ్ఞతలుతెలిపారు. ఈ కార్యక్రమ ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్ పర్సన్ వున్నశైలుజ వెంకటేశ్వర్లు, వైయస్ కరుణాకర్ మున్సిపాలిటీ కో-ఆప్షన్, మొహమ్మద్ అత్తఉల్లా 17వ వార్డ్ మైనార్టీ ఇన్చార్జ్, టౌన్ ప్రెసిడెంట్ రైస్ కౌన్సిలర్ , ఉమేర్ 3 వ వార్డ్ మైనార్టీ ఇన్చార్జ్, అల్లంపల్లి నర్సింహా (డిసిసి వైస్ ప్రెసిడెంట్), నజీర్ భాయ్ సమీర్ (వైస్ చైర్మన్), నవీద్ 11వ వార్డ్ కౌన్సిలర్, మౌలానా నజీర్ సాబ్, అజీం భాయ్ మక్కా మసీద్ సదర్, అమర్, మురళి, పున్నబోయే సైదులు, మౌలానా ఫారుక్ సాబ్, జానీ కౌన్సిలర్, కైసర్ భాయ్, మౌలానా ఫారుక్ సాబ్, ఆనంద్, అన్వర్ బాయ్ షాకిల్లి, మధు సెట్, అబ్రార్ భాయ్, వాజిద్ భాయ్, సయ్యద్ వహీదుల్లా, రషీద్ భాయ్ రాయల్ ఎలక్ట్రిషన్, అజీజ్, ఇస్మాయిల్, షరీఫ్ బాయ్ ఫాతిమా మస్జిద్ సదర్, తన్వీర్, రెహమాన్, కుబేఖా, ఫయాజ్, ఎజాజ్, మోఇజ్ భాయ్ తదితరుల పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం..

**-ఇంటింటికీ సంక్షేమం.. ప్రజల్లోకి కూటమి నేతలు**
**-రౌడూరులో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ.**
**-హామీల అమలుతో ప్రజల విశ్వాసం నిలబెట్టుకున్న ప్రభుత్వం**



**మంత్రాలయం, ఆగస్టు 01నవ సంఘర్షణ**
ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాల ఫలాలు చేరేలా కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని, ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ అభివృద్ధి, సంక్షేమాన్ని గ్రామాల గడప దాకా తీసుకెళ్తోందని కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ పేర్కొన్నారు. పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రతి అర్హ కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ అన్నారు. మంత్రాలయం నియోజకవర్గంలోని రౌడూరు గ్రామంలో శనివారం నిర్వహించిన పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంతో పాటు ఇంటింటికి సంక్షేమం – రెండేళ్ల అభివృద్ధి కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మంత్రాలయం నియోజకవర్గ ఇన్చార్జి రాఘవేంద్ర రెడ్డి కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేసిన నాయకులు, గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం దశలవారీగా అమలు చేస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటోందని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు సమాజంలోని అన్ని వర్గాలకు చేరేలా అధికారులు, పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని గుడిసె ఆది కృష్ణమ్మ సూచించారు. ప్రతి గ్రామంలో అభివృద్ధి ఫలాలు ప్రజలకు కనిపించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. అనంతరం నాయకులు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎల్ఎల్సీ చైర్మన్ టిప్పు సుల్తాన్, టీడీపీ సీనియర్ నాయకుడు ఉలిగయ్య, కౌతాళం మండల అధ్యక్షుడు సురేష్ నాయుడు, శివ, బుదదయ్య, రమేష్, రాజు, ఉసేని, మహమ్మద్, నాయక్, మనూరు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు తప్పనిసరి

**-నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య**



**నందికొట్కూరు, ఆగస్టు 01నవ సంఘర్షణ**
ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, అందులో ఎలాంటి లోపాలకు తావులేదని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య స్పష్టం చేశారు. శనివారం ఉదయం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ విభాగం నుంచి ఇన్‌పేషెంట్ వార్డులు, లేబర్ రూమ్, ల్యాబ్, ఫార్మసీ విభాగాల వరకు క్షుణ్ణంగా పరిశీలించారు. రోగుల వద్దకు వెళ్లి వైద్యం సక్రమంగా అందుతోందా, మందులు అందుబాటులో ఉన్నాయా, సిబ్బంది తీరు ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేకంగా గర్భిణులు, బాలింతల వార్డులను సందర్శించి వారికి అందుతున్న వైద్య సేవలు, పౌష్టికాహారంపై ఆరా తీశారు.ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బందితో సమావేశమైన ఎమ్మెల్యే గిత్త జయసూర్య మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ పథకం ద్వారా పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. అలాగే 104, 108 అంబులెన్స్ సేవలతో పాటు ఆసుపత్రుల్లో అవసరమైన పరీక్షలు, స్కానింగ్‌లు, మందులు ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. గర్భిణులకు అవసరమైన అన్ని పరీక్షలు, టీకాలు, వైద్య సేవలు సకాలంలో అందించాలని, ప్రసవం అనంతరం తల్లీబిడ్డల సంరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకునేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగితో, ముఖ్యంగా గర్భిణులు, బాలింతలతో మర్యాదగా, మానవత్వంతో వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. వారి అవసరాలను వెంటనే తీర్చేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం పూర్తిగా ఉచితమని, ఎవరైనా రోగుల నుంచి ఒక్క రూపాయి కూడా వసూలు చేసినా సహించేది లేదని ఎమ్మెల్యే హెచ్చరించారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతల నుంచి డబ్బులు డిమాండ్ చేసినా, ఇతర అక్రమాలకు పాల్పడినా కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆసుపత్రిలో ఉన్న చిన్నచిన్న సమస్యలను వెంటనే పరిష్కరించి, ప్రజలకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. 'ప్రజల ఆరోగ్యమే మా ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యం. తల్లీబిడ్డల సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోంది. ప్రతి పేద కుటుంబానికి నాణ్యమైన వైద్య సేవలు అందేలా నిరంతరం పర్యవేక్షిస్తాం. నిర్లక్ష్యం వహించే వారిని ఉపేక్షించం" అని ఎమ్మెల్యే గిత్త జయసూర్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వర్షానికి దెబ్బతిన్న విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ....



**గాంధారి, ఆగస్టు 01నవ సంఘర్షణ**
మండలంలోని కై తండా గ్రామపంచాయతీ పరిధిలో శుక్రవారం రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు మధ్యలో చెరువు కట్టపై 11 కేవి విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. అయితే పూర్తిగా కరెంటు సరఫరా నిలిపివేసి విద్యుత్ స్తంభాలకు పునరీకరణ చేపట్టారు. విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో కాయితీ తండాలో విద్యుత్ లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని ఉప సర్పంచ్ వెంకటరావు డి ఈ మల్లేశ్వర్ దృష్టికి తీసుకెళ్లడంతో స్థానిక అయ్యే లైన్మెన్ లు కలిసి కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా తమ తండాకు విద్యుత్ సరఫరా మరమ్మతు పనులు చేయించినందుకు ఏ ఈ లైన్ మెన్ కు తండవాసులు హర్షం వ్యక్తం చేశారు.

## సిద్దిపేట రోడ్ - వివేకానంద విగ్రహం నుండి ధర్మారం రోడ్ వరకు గుంతలను పూడ్చిన చైర్పర్సన్ లావణ్య నాగరాజు కమిషనర్ రవీందర్







**రామాయంపేట ఆగస్టు 01నవ సంఘర్షణ**
వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు వర్షాకాలం కారణంగా రోడ్డుపై ఏర్పడిన గుంతలను వెంటనే కూర్చొని ఆదేశించడంతో టిప్పర్లు జెసిపి మరియు లేబర్ సహాయంతో మెటీరియల్ వేసి గుంతలు పూర్తిగా పోస్ట్ చేయడం జరిగింది అదేవిధంగా రోడ్డుపై నీరు నిల్వ ఉండకుండా ఉండేందుకు డ్రైనేజీ లకు డ్రీల్ సహాయంతో వేయడం జరిగింది, వెంటనే విలువ ఉండనీరును కలలోకి జాయిన్ చేయడం జరిగింది దీనికి కాంగ్రెస్ నాయకులు అందరు పాల్గొని ప్రజలకు పూర్తి సహకారాన్ని విజయవంతం చేశారు

# ఒక్కో ఇంటా ఒక మొక్క... పచ్చని తీదేడే మా లక్ష్యం

**-పర్యావరణ పరిరక్షణకు గ్రామ ప్రజలందరూ భాగస్వాములు కావాలి**
**- సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా మొక్కల పంపిణీ**
**- పల్లె దవాఖాన వద్ద హరితహారం కింద వృక్షారోపణ**




**చింతపల్లి, ఆగస్టు 01నవ సంఘర్షణ**
చింతపల్లి మండలం తీదేడు గ్రామంలో పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తూ గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో మొక్కల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రజలకు వివిధ రకాల మొక్కలను పంపిణీ చేసిన అనంతరం హరితహారం కార్యక్రమంలో భాగంగా పల్లె దవాఖాన ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతి కుటుంబం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించడం ద్వారా గ్రామాన్ని పచ్చదనంతో కళకళలాడేలా చేయవచ్చన్నారు. మొక్కల పెంపకంతో పర్యావరణ సమతుల్యతను కాపాడటంతో పాటు భావితరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని పేర్కొన్నారు. పచ్చని తెలంగాణ నిర్మాణంలో ప్రతి గ్రామస్తుడు బాధ్యతగా భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఇడబోయిన వెంకటయ్య యాదవ్, వార్డు సభ్యులు బొడ్డు పార్వతమ్మ యాదగిరి, మాదగోని కృష్ణ గౌడ్, దాసరి కళమ్మ ముత్తయ్య, రెడ్డి పద్మ పరమేష్, మర్ల యాదగిరి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సంపాదకీయం

### ఎన్డీయేకు ముందున్నది ముసళ్ల పండుగ!



ఎన్డీయే అధికారంలో ఉన్న ఈ 12 ఏండ్లలో దేశం పురోగమనం చెందిందని బీజేపీ, దాని మిత్రపక్షాలు డప్పు కొట్టుకుంటున్నాయి. కానీ, దేశంలోని ఏ వర్గంలోనూ సంతృప్తి లేదు. పేదరికం ఆనవాళ్లు పోలేదు. విదేశాల్లో దాచిపెట్టిన నల్లధనాన్ని భారతదేశానికి తెప్పించి ప్రతి ఒక్కరి బ్యాంక్ అకౌంట్‌లో రూ.15 లక్షలు డిపాజిట్ చేస్తామని నమ్మించిన ఎన్డీయే ఆ తర్వాత మొండిచేయి చూపింది. దేశంలో నిరుద్యోగమే ప్రధాన సమస్యగా ఉన్నది. అది యేటేటా పెరుగుతూ ప్రస్తుతం 16 శాతానికి చేరింది. యేటా విద్యావంతులు, పట్టభద్రులు, పీజీ, పీహెచ్‌డీల సంఖ్య పెరుగుతున్నా వారికి ఉద్యోగాలు, ఉపాధి గగనంగా మారాయి. దేశంలో చదువుకు తగిన ఉద్యోగం చేస్తున్న పట్టభద్రులు కేవలం 8.25 శాతం మంది మాత్రమే. కేంద్రం నిరుద్యోగ సమస్య పరిష్కరించడంలో విఫలం కావడంతో దేశంలో 22 కోట్ల మంది పట్టభద్రులు నిరుద్యోగులుగా ఉన్నారు. సాధారణ పట్టభద్రుల్లో 84 శాతం మంది, ఇంజినీరింగ్ పట్టభద్రుల్లో ప్రతి 10 మందిలో 8 మందికి కొలువులు రావట్లేదు. యేటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మోదీ సర్కార్ ఇచ్చిన హామీ బూటకంగా మిగిలిపోయింది. విద్యావ్యవస్థలో సమూల మార్పులు జరగడం లేదు. నిత్యం విద్యార్థుల ఆత్మహత్యలు, ర్యాగింగ్‌లు, వేధింపులు జరుగుతున్నాయి. ఉపాధి ఆధారిత విద్యావిధానం అమలుపై దృష్టి సారించడం లేదు. మతం పేరిట భావోద్వేగాలను రెచ్చగొట్టి విద్యార్థులకు సైతం పావులుగా వాడుకుంటున్నది తప్ప వారి జీవితాల్లో కొత్త వెలుగులు తెచ్చేందుకు ఏ మాత్రం ప్రయత్నించడం లేదు. నిత్యావసరాల ధరల మీద నియంత్రణ లేదు. బియ్యం, పాలు, వంటనూనె, పప్పులు, గోధుమపిండి, చక్కెర, ఇతర వినియోగ వస్తువుల ధరలు 12 ఏండ్లలో 40 శాతం నుంచి 400 శాతం వరకు పెరిగాయి. వంటగ్యాస్, చమురు ధరలు గరిష్ఠ స్థాయికి చేరాయి. ఎన్నికల సమయంలో తప్ప మిగిలిన సమయాల్లో పెట్రో ధరలు పెంచడమే లక్ష్యంగా కేంద్రం వ్యవహరిస్తున్నది. 120 ప్రభుత్వరంగ సంస్థలను అతి తక్కువ ధరకే బడా పారిశ్రామికవేత్తలకు కట్టబెట్టారు. రైతాంగం పరిస్థితి దయనీయ స్థితికి చేరుకున్నది. విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల ధరలు పెరిగాయి. రైతులకు గిట్టుబాటు ధర రావడం లేదు. నిత్యం రైతాంగం ఆందోళన చేస్తుంటే వారిని అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నదే తప్ప సమస్యల పరిష్కారానికి చొరవ చూపడం లేదు. పేదలు, రైతులకు రుణమాఫీకి వ్యతిరేకమని చెప్పిన కేంద్రం పెద్ద పెద్ద కంపెనీలకు రుణ రాయితీలిచ్చి ఇచ్చి వాటిపై ప్రేమను చాటుకుంటున్నది. 2024లో 10,546 మంది రైతులు, రైతు కూలీలు ఆత్మహత్యకు పాల్పడినట్టు ఎన్సీఆర్బీ నివేదిక వెల్లడించింది. 67 ఏండ్లు పాలించిన ప్రభుత్వాలు రూ.55 కోట్ల లక్షల అప్పు చేస్తే ఎన్డీయే సర్కార్ ఇప్పటికే రూ.155 లక్షల కోట్లు అప్పు చేసింది. అంటే దేశంలో ప్రతి ఒక్కరిపైనా అప్పు లక్షా ఇరవై వేలకు చేరింది. పెద్ద నోట్ల రద్దు వల్ల భారత ఆర్థిక వ్యవస్థ బలహీనపడింది. దేశంలోని పేద, మధ్యతరగతి ప్రజలు ఆర్థిక ఇబ్బందులకు గురికాగా, బడాబాబులు కుబేరులయ్యారు. భారత్‌లో తయారీ (మేకిన్ ఇండియా)ని విశ్వవ్యాప్తంగా చేస్తామని బీజేపీ చెప్పగా చివరికి విదేశాల నుంచి దిగుమతులు పెంచింది. దేశ రైతాంగాన్ని, పారిశ్రామికరంగాన్ని దెబ్బతీసేలా అమెరికా, బ్రిటన్ వంటి దేశాలతో వాణిజ్య ఒప్పందాలు చేసుకున్నది.నైతిక విలువలకు తిలోదకాల్చి రాజకీయ పార్టీలను చీల్చడం, బలహీనపరచడం, ప్రజాస్వామ్య పద్ధతిలో రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన బీజేపీయేతర ప్రభుత్వాలను కూలదోస్తున్నది. తమ మాట వినని ప్రతిపక్ష పార్టీల నేతలను వివిధ స్కామ్‌లలో ఇరికించి జైలుపాలు చేయడం ఆనవాయితీగా మారింది. ప్రభుత్వ దర్యాప్తు సంస్థలైన సీబీఐ, ఈడీ, ఆదాయ పన్ను శాఖలు రాజకీయ లక్ష్యాల సాధనకు ఉపయోగపడుతున్నాయి. ఈడీ ఇప్పటివరకు 121 కేసులు నమోదు చేయగా 95 శాతం విపక్ష నాయకులపై మనీ లాండరింగ్ చట్టం కింద పెట్టిన కేసులు 5,420. అందులో 5,150 కేసులు ప్రతిపక్ష నేతలపైనే ఉన్నాయి. వివిధ రాజకీయ పార్టీల నేతలపై 149 రాజద్రోహం కేసులు నమోదయ్యాయి. విద్యావ్యవస్థ మరింత దెబ్బతిన్నది. ద్రవ్యోల్బణం, నిరుద్యోగిత, ఉత్పాదకత, పౌర స్వేచ్ఛ, లింగ సమానత్వం, విద్య, వైద్యం వంటి రంగాల్లో మనదేశం ర్యాంకు యేటేటా తగ్గుతున్నది. 2014లో మోదీ నేతృత్వంలో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గడిచిన 12 ఏండ్లలో దేశంలో 68 ఉగ్రదాడులు జరిగాయి. ఆయా ఘటనల్లో 360 మంది వరకు సైనికులు, పోలీసులు అమరులయ్యారు. 230 మంది పౌరులు మృతి చెందారు. 2014 నుంచి ఇప్పటివరకూ ఒక్క జమ్ముకశ్మీర్‌లోనే 11 ఉగ్రదాడి ఘటనలు జరిగాయి. 2016లో జరిగిన 'ఉరి' ఉగ్రదాడి, 2019లో జరిగిన 'పుల్వామా' దాడి, గత యేడాది జరిగిన పహల్గాం ఉగ్రదాడి, ఎర్రకోట దగ్గర కారు పేలుడుతో యావత్తు దేశం వణికిపోయింది. మన విదేశాంగ విధానం సరిగా లేదు. సమయస్ఫూర్తి లోపించడం వల్ల అనేక దేశాలతో అంతరం క్రమేణా పెరుగుతున్నది. దిగుమతులపై ఆధారపడిన దేశానికి ఈ విధానాలు సమస్యగా మారి సంక్షోభాన్ని సృష్టిస్తున్నాయి. అధికారపక్షాన్ని నిలదీసి ప్రజావ్యతిరేక విధానాలను అడ్డుకోవాల్సిన గురుతర బాధ్యత విపక్షాలకే ఉంటుంది. కానీ ప్రధాన ప్రతిపక్షంగా కాంగ్రెస్ ఆ దిశగా ఎదగడం లేదు. పోరాటపంథా లోపించి ఎన్డీయేను ఢీకొట్టడంలో అది విఫలమవుతున్నది. 2024 ఎన్నికల సందర్భంగా విపక్షాల బలం పెరిగినా దానిని సద్వినియోగం చేసుకోలేకపోతున్నాయి. అన్ని విపక్షాలను ఏకం చేసి ఎదుర్కొనే అవకాశం ఉన్నా అలాంటి చొరవ కాంగ్రెస్‌లో లోపిస్తున్నది. దేశంలో అత్యధిక విపక్ష ఎంపీలున్న డీఎంకే వంటి పార్టీని వీడి, అధికారంలో పాలుపంచుకోవడానికి తమిళనాడులో విజయ్ నాయకత్వంలోని టీవీకే పార్టీతో చేతులు కలుపడం ఆ పార్టీ వ్యూహరాహిత్యాన్ని బహిర్గతం చేసింది. కాంగ్రెస్‌లో సమర్థులున్నా వారి సేవలను ఆ పార్టీ వినియోగించుకోలేక రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీలపైనే ఆధారపడుతున్నది. మరోవైపు దేశంలోని మీడియాను ఎన్డీయే ప్రభుత్వం గుప్పిట్లోకి తీసుకొంటున్నది. విపక్షాలు విఫలమైనపుడు ఆ పాత్ర పోషించాల్సిన మీడియా ప్రేక్షకపాత్ర, అధికారపక్షానికి వంతపాడటానికే ప్రాధాన్యం ఇస్తున్నది. జంతర్ మంతర్‌లో సీజేపీ ఆందోళన సందర్భంగా మీడియా వైఖరిపై విద్యార్థులు, యువత ఆగ్రహం ప్రదర్శించారు. సీజేపీ ఆందోళన ఎన్డీయే ప్రభుత్వానికి గుణపాఠమైంది. కాంగ్రెస్, ఇతర రాజకీయ పార్టీలు, మీడియాకు సైతం కనువిప్పు కలిగించింది. దేశంలోని విద్యార్థి, యువత, రైతులు, అన్ని వర్గాల ప్రజలను చైతన్యపరిచింది. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాలు నిర్వీర్యమైనా, మీడియా అధికారపక్షానికి కొమ్ముకాసినా ఆ పాత్రను వారే పోషిస్తారనే సత్యాన్ని వెల్లడించింది. ఇది ముమ్ముందు పెనుమార్పులకు దారితీస్తుంది. సామదానభేద దండోపాయాలతో వ్యవహరిస్తున్న కేంద్రం ఇప్పటికైనా తన వైఖరి మార్చుకోకపోతే రానున్న రోజుల్లో మరింత ప్రజాగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుంది. మీడియా సైతం తన ధోరణిని మార్చుకోవాలి. ప్రజల కోణంలో ఆలోచించి నడుచుకోవాలి.

# ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల సామర్థ్యం ఎంత?




నీట్ పేపర్ లీకేజీ వ్యవహారం దేశంలో ఎలాంటి తీవ్ర పరిణామాలను సృష్టించిందో తెలిసిందే. కాక్రోచ్ జనతా పార్టీ ఈ అక్రమాలపై సాగించిన ఉద్యమం కార్చిచ్చులా దేశం లోనే కాదు, విదేశాల్లో కూడా వ్యాపించింది. దీంతో కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి లోపాలను సరిదిద్దే చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోడీ పేపర్ లీక్ కేసులను విచారించడానికి ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. ఈమేరకు ఢిల్లీలోని రౌస్ ఎవెన్యూకోర్టు కాంప్లెక్సులో పేపర్ లీకేజీ కేసులను ప్రత్యేకంగా విచారించడానికి ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఢిల్లీ హైకోర్టు ఆగమేఘాలపై ఏర్పాటు చేసింది. దీంతో ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల సామర్థ్యంపై సమీక్ష తెరపైకి వచ్చింది. అయితే ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేస్తున్నారే కానీ కేసులకు తగినట్టు కొత్తగా న్యాయమూర్తులను నియమించడం కానీ, న్యాయవ్యవస్థలో అదనపు సామర్థ్యాన్ని సమకూర్చక పోవడంతో ఒకవంక న్యాయవాదులు, సిబ్బంది, వనరుల కొరత, మరోవంక పెండింగ్ కేసుల భారంతో అవి సతమతమవుతున్నాయి. ఈ కోర్టులు సమర్థంగా పనిచేయడానికి అవసరమైన సంస్కరణలు అమలులో ఉన్నాయా లేదా ఆలోచించాల్సిందే. సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేసే ప్రక్రియ నిర్ణయించిన సమయానికి క్రమబద్ధంగా జరుగుతోందా? కేసులు అనవసరంగా వాయిదా పడకుండా కొనసాగేందుకు భాగస్వామ్య పక్షాలు కలిసి సమన్వయంతో వ్యవహరిస్తున్నాయా? ఇవన్నీ సందేహాలు తలెత్తుతున్నాయి. ఈ పరిస్థితుల్లో పేపర్ లీక్ కేసుల విచారణ చేపట్టడమంటే ప్రస్తుతం కోర్టుల్లో కొనసాగుతున్న న్యాయమూర్తులకే ఈ అదనపు బాధ్యతలు అప్పగించవలసి వస్తుంది. ఇప్పటికే ఉన్న న్యాయమూర్తులను, న్యాయవనరులను ఒక చోటనుంచి మరో చోటికి మార్చుకుని ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు పనిచేస్తాయి. ఫలితంగా ప్రత్యేకంగా కేటాయించిన కేసులు వేగంగా ముందుకు సాగుతాయి.వీటిని పరిష్కరించాలంటే న్యాయవాదులకు కానీ, పోలీస్ యంత్రాంగానికి కానీ అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం తప్పనిసరి. ఈ కేసుల పరిష్కారం న్యాయవ్యవస్థకు సవాలుగా మారింది. అలాగే దేశం మొత్తం మీద ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల్లో దాదాపు 2.45 లక్షల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఏటా కేసుల క్లియరెన్సు రేటు చాలా తక్కువగా ఉంటోంది. ఒక్కమాటలో చెప్పాలంటే కొత్తగా వస్తున్న కేసుల భారాన్ని తట్టుకునేంత వేగంగా వ్యవస్థ ముందుకు సాగలేకపోతోంది. 2025లో దాదాపు 1.4 లక్షల కేసులు నమోదు కాగా, కేవలం 66,000 మాత్రమే పరిష్కారమయ్యాయి. ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు నిజంగా వేగంగా న్యాయాన్ని అందించగలుగుతున్నాయో లేదో సమీక్షించాలనుకుంటే ఆ కేసుల డేటా అవసరం. జాతీయ న్యాయడేటా గ్రిడ్ (ఎన్‌జెడిజి) ద్వారా సాధారణ కేసుల్లో ఎన్ని ఎంతకాలం పెండింగ్‌లో ఉన్నాయి? ఎన్ని పరిష్కారమయ్యాయి? తదితర వివరాలు లభిస్తాయి కానీ ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల కేసుల వివరాలు మాత్రం లభ్యం కావు, ఇలాంటి పారదర్శకత లేకుండా ఈ కోర్టులు తమ లక్ష్యాన్ని ఎంతవరకు నెరవేర్చ గలుగుతాయో సమీక్షించడం కష్టం అవుతుంది. దేశ రాజధాని ఢిల్లీలో కూడా ప్రాసిక్యూటర్లు సరిపడా లేకపోవడంతో ఒకే పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఒకే రోజులో పలు కోర్టుల్లో హాజరయ్యే పరిస్థితి కనిపిస్తోంది. ప్రాసిక్యూషన్‌ను బలోపేతం చేయాలన్న శ్రద్ధ కనిపించడం లేదు.క్లిష్టమైన క్రిమినల్ కేసుల విచారణ ఆందోళనకరమైన విషయంగా మారింది. ప్రభుత్వం తరపు న్యాయవాదులు ఎక్కువ న్యాయ పరిజ్ఞానం, పరిశోధన వనరులు కలిగిన డిఫెన్స్ లాయర్ల బృందాలతో పోరాడాల్సి వస్తోంది. ఇప్పుడు పేపర్ లీక్ కేసులు మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లు వంటి పరికరాల నుంచి లభించే డిజిటల్ సాక్ష్యాలపై ఆధారపడి ఉంటున్నాయి. ఆ సాక్ష్యాలను పరిశీలించడానికి సైబర్ ఫోరెన్సిక్ అవసరం. కానీ ఫోరెన్సిక్ విభాగంలోనూ నిపుణులు, సిబంది కొరత, మౌలిక సదుపాయాల లోటుతో మితిమీరిన పనిభారంతో ఫోరెన్సిక్ లేబొరేటరీలు అల్లాడుతున్నాయి. ప్రాసిక్యూషన్‌ను బలోపేతం చేయడం, ఫోరెన్సిక్ సామర్థ్యాన్ని విస్తరింప చేయడం, జుడీషియల్ ఉద్యోగాలను భర్తీచేయడం ఇవన్నీ జరిగితేనే కానీ ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు న్యాయాన్ని వేగంగా అందించలేవు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఎంత సమర్థంగా పనిచేయాలంటే దానికి ముందు జరిగే దర్యాప్తు అంత పకడ్బందీగా ఉండాలి. సుశిక్షితులైన పరిశోధకులు, సాంకేతిక, ఫోరెన్సిక్ పరిశోధనల సహాయం, విశ్వసనీయమైన సాక్ష్యాలుంటే కానీ ఫాస్ట్‌ట్రాక్ కోర్టులనుంచి ప్రధాని మోడీ ఆశించిన న్యాయం వేగంగా లభించదు. వ్యవస్థాపరమైన ఈ సమస్యలను పరిష్కరించకుండా ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు మాత్రమే త్వరితగతిన న్యాయం అందిస్తాయని ఆశించడం ఎండమావి అవుతుంది.

# జంతర్ మంతర్ సామాజిక పాఠాలు

పద్దెనిమిదవ శతాబ్దంలో సైన్స్ పాఠాలు చెప్పిన జంతర్ మంతర్ ఇపుడు సామాజిక పాఠాలు చెప్తున్నది. అధికారపక్షానికి, ప్రతిపక్షాలకు రాజకీయ పాఠాలు కూడా. జంతర్ మంతర్ ఆందోళన ప్రస్తుత దశ ముగియవచ్చు. అయినా పాఠాలు కొనసాగుతున్నాయి. ఇది పరిశీలకులకు తోస్తున్న మాట మాత్రమే కాదు. కాక్రోచ్ జనతా పార్టీ పేరిట సరికొత్త చైతన్యాలు చూపిన యువతరం, తమ ఉద్యమం ఇంతటితో ముగియలేదని, భవిష్యత్తులోకి చాలా దూరం ప్రయాణించవలసి ఉన్నదని, ప్రయాణించగలమని, ప్రస్తుతానికి ఇది ఒక మజిలీ మాత్రమేనని స్వయంగా పదే పదే ప్రకటిస్తున్నారు. ప్రధానంగా విద్యారంగ సమస్యలతో ఆరంభించిన కాక్రోచ్ యువతరం, అందుకు మాత్రమే పరిమితం కాకుండా అనేక ఇతర సామాజిక అంశాలను కూడా ప్రస్తావిస్తుండటం గమనార్హమైన విషయం. ఇటువంటి ధోరణి కొంతవరకు వామపక్ష విద్యార్థి సంఘాలలో ఉండటం తెలిసిందే కాగా, అటువంటి మొగ్గ ఏమీ ప్రకటిత రూపంలో లేని ఒక సరికొత్త వేదిక నాయకత్వాన కనిపించటం ఒకటైతే, అసలు మొత్తం విద్యార్థి లోకానికి, యువజన లోకానికి వ్యాపించి కనిపించటం గమనించదగ విశేషం. వారు ఒకవైపు విద్యా వ్యవస్థను, మరొక వైపు రాజకీయ వ్యవస్థను కూడా ప్రశ్నించటం గమనించదగ్గది.కాక్రోచ్ తక్షణ ఆందోళనకు ప్రేరణ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి చేసిన అవమానకర వ్యాఖ్యలన్నది తెలిసిందే. అదే కాక్రోచ్‌ను తమ పేరుగా తీసుకున్న యువకులు వెంటనే లేవనెత్తిన ప్రశ్నలను చూడండి. బొద్దింకలు మురికినుంచి పుట్టుకు వచ్చే అనారోగ్యకరమైన కీటకాలన్నది నిజమేగాని, మన వ్యవస్థ మురికిగా తయారు కావటం వల్లనే ఇది జరుగుతున్నది. మరి ఈ మురికి వ్యవస్థకు బాధ్యత ఎవరికి? బొద్దింకలదా లేక ఆ మురికి వ్యవస్థను సృష్టించిన వారిదా? తన వ్యాఖ్యలు పట్ల నిరసన రావటంతో ప్రధాన న్యాయమూర్తి వివరణ ఇవ్వ బూనారుగాని అది చెల్లుబాటు కాలేదు. ఎందుకంటే తను నకిలీ లా డిగ్రీల వారిని ఉద్దేశించి ఆ వ్యాఖ్య చేసిన మాట నిజమే అయినా, ఈ దేశపు యువతరం ఎటువంటి వ్యవస్థలో, ఎటువంటి జీవిత పరిస్థితుల కారణంగా, ఇటువంటి మార్గాలను అనుసరించవలసిన విధిలేని స్థితి ఏర్పడుతున్నది? దీని అర్థం వారు ఈ మార్గాన్ని అనుసరించ వలసి రావటం సరైనదని కాదు. అందువల్ల తాత్కాలికంగా వారికి, వ్యవస్థకు కొంత హాని కలుగుతుందన్నది నిర్వివాదాంశం. అదే సమయంలో కార్యకారణ సంబంధం అనే దానిని విస్మరించి, ఈ మురికి వ్యవస్థకు బలి అవుతున్న వారిన్ని తమ మార్గమే సరైనది కాదని కోర్టులు నిందించటం సరైనదవుతుందా? అందువల్ల సమస్య పరిష్కారమవుతుందా? సమస్యను పరిష్కరించవలసింది కోర్టులని యువతరం ఏమీ అనటం లేదు. కాని కోర్టు వ్యాఖ్యను ఆధారంగా తీసుకుని వ్యవస్థను ప్రశ్నిస్తున్నారు. పార్టీలను, ప్రభుత్వాలను సవాలు చేస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వాన్నే కాదు. అన్ని పార్టీలనూ. ఎందుకంటే పరీక్షలు, విద్య ఈ విధంగా ఉండటానికి అందరూ బాధ్యులే. అందరూ ఏవో ఒక దశలో కేంద్రంలోనో, రాష్ట్రాలలోనో పరిపాలించిన వారే, పరిపాలిస్తున్నవారే. ఇదే ఆందోళన సందర్భంగా యువతరం, అసలు మన దేశంలో విద్యారంగం మొదటి నుంచి ఎట్లా ఉంది? మన కళ్లముందే అభివృద్ధి చెందుతున్న ఇతర దేశాలలో ఏవిధంగా



అమలవుతున్నది? ఇక్కడ మెరుగైన విద్య ఖరీదుగా మారి కొన్ని వర్గాలకు అందుబాటులో ఉండగా, తక్కిన విస్తృతమైన వర్గాలు ఇన్ని దశాబ్దాలు గడిచినా ఎందుకు వెనుకబడి ఉన్నాయి? ప్రభుత్వ పాఠశాలలు అధ్వానంగా మారుతుండటానికి బాధ్యులెవరు? అని ప్రశ్నిస్తూ ఇదంతా మారాలంటున్నారు. ఆసక్తికరంగా ఆ స్థితిని వారు దేశంలోని పేదరికానికి, ధనికపేద తారతమ్యాలకు, ప్రభుత్వాల విధానాలవల్ల కొందరు సూపర్ రిచ్‌గా మారుతుండటానికి ముడిబెట్టి చర్చిస్తున్నారు. ఈ ప్రశ్నలన్నీ తక్షణ సందర్భంలో కేంద్రంలోని అధికార పక్షానికి సంబంధించిన అయినా, అన్ని పార్టీలకూ వేయటం కనిపించింది. ఇవన్నీ చదువులతో ఆరంభించి దేశంలోని పేదరికం వరకు మొత్తం వ్యవస్థతో నిమిత్తంగల సామాజిక ప్రశ్నలు, పాఠాలు అవుతున్నాయి. ఇది అన్ని పార్టీలూ గుర్తెరగాలి. అట్లాగాక, ఈ యువతరం వెల్లువ తమకు రాజకీయంగా ఉపయోగపడగలదని భావించి అందుకోసం ప్రయత్నించినట్లయితే అది, రేపు తమకు కూడా ఎదురు తిరగగలదు. ఈ మాట కేవలం ఊహాగానం కాదు. ఆందోళన సాగిన రోజులలో వేలాదిగా వెలువడిన సోషల్ మీడియా పోస్టులలో నాయకులుగాని, సాధారణ విద్యార్థులు గాని చేసిన వ్యాఖ్యలు తగినన్ని గమనించిన వారు ఈ మాట గుర్తించే ఉంటారు.కాక్రోచ్‌లు చేసింది నీట్‌కు సంబంధించిన నిరసన మాత్రమే కాదు. వారు అనేక ఇతర అంశాలను కూడా అదే క్రమంలో రగిలించారు. ఉదాహరణకు ఒకటి గమనించండి. అభిజిత్ దీప్కే మొదటి రోజున జంతర్ మంతర్‌కు చేరినపుడే ఎత్తిచూపిన విషయాలలో ఒకటి, ఎంత కాలం హిందూ ముస్లిం, ఇండియా పాకిస్థాన్ ప్రచారాలతో యువతరాన్ని భ్రమపెడతారని. అది చాలా సాహసంతో కూడిన మాట. అటువంటి ప్రచారాలు యువతకు చేసిన మేలేమిటి? రాజకీయాల కోసం ఉపయోగపడటం తప్ప? అన్నవి ఆయన ప్రశ్నలు. బిజెపి ప్రచారాల ఉద్దేశం రహస్యం కాదు. కాని ఈ ప్రశ్నలు లేవనెత్తటానికి ప్రతిపక్షాలు సైతం భయపడుతూ వచ్చాయ. ఒకవైపు ఈ నినాదాల ప్రభావంతో ప్రజలలో, యువతలో మతతత్వ ధోరణి పెరుగుతున్నందున ఆ నినాదాలను ప్రశ్నించినట్లయితే తమకు హిందువుల ఓట్లు పోవచ్చునన్నది ఇతర పార్టీల భయం.కొన్ని సంవత్సరాలుగా ఇదే పరిస్థితి సాగుతున్నది. అది బిజెపికి అనుకూలంగా మారుతున్నది. కొన్ని ప్రతిపక్షాలు సాఫ్ట్ హిందూత్వ కార్డును ఉపయోగించజూస్తున్నాయిగాని పనిచేయటం లేదు. హిందూత్వపై ట్రేడ్‌మార్క్ బిజెపిదిగా మారిన పరిస్థితికి ఫలితమది. విశేషమేమంటే చివరకు వామపక్షాలు కూడా ఈ భయానికి మినహాయింపు కాలేకపోయాయి. ఇటువంటి స్థితిలో అభిజిత్ చేసిన వ్యాఖ్యలు ఎంత సాహసంతో కూడినవో అర్థం చేసుకోవచ్చు. అదే ఒక సామాజిక విశేషమంటే ఆ వైఖరి మొత్తం జంతర్ మంతర్ యువ సందోహానికి వ్యాపించటం మరింత విశేషంగా మారింది. ఆమేరకు గల అనేక వీడియోలను చాలా మంది గమనించి ఉంటారు. అభిషేక్ మాటలనే వందలాది యువతీయువకులు అంటూపోయారు. ఈ ప్రశ్నలు క్రమంగా దేశవ్యాప్తమవుతున్నాయి. తమ కుటుంబమంతా బిజెపి అని, తాము కూడా ఇంతకుముందు వరకు ఆ పార్టీ మద్దాతుదారులమని, ఇకముందు ఆ పని చేయబోమని అనటమే గాక, తమ పెద్దలు కాదన్నా తమ వైఖరి ఇదేనన్నారు. సరైన విద్య, సరైన పాలన ఇవ్వలేక ఈ తరహా మతప్రచారాలు, అదంతా చాలదన్నట్లు నీట్ గురించి ప్రశ్నించిన యువతపై ఈ తరహా దమనకాండ ఏమిటన్న విమర్శలు వారి నుంచి వినిపించాయి. ఇదంతా బిజెపిని కలవరపెడుతున్నది.

రెండు వార్తలు ఈ స్థితిని పరాకాష్ఠకు తీసుకు వెళ్లాయి. ఒకటి, ధర్మేంద్ర ప్రధాన్ ది ఒడిశా కాగా, ఆ రాష్ట్రానికి చెందిన ఒక బిజెపి మహిళ ఎం.పి కుమార్తె బహిరంగంగా కాక్రోచ్ ఆందోళనలో పాల్గొని మోడీ ప్రభుత్వాన్ని వీడియోలో విమర్శించటం. దానితో గాభరా పడిన ఢిల్లీలోని పార్టీ నాయకత్వం ఆ యూట్యూబ్ పోస్టును తొలగించి క్షమాపణలు చెప్పించాలని ఆ ఎంపికి సూచించగా, అందుకు ఆ యువతి నిరాకరించటం. అసోంలోనయితే ఒక బిజెపి మంత్రి కుమార్తె అదే విధంగా కాక్రోచ్ ఆందోళనలో పాల్గొని మోడీ ప్రభుత్వాన్ని విమర్శించి వెనుకకు తగ్గేందుకు నిరాకరించింది. వార్తాసేవ బిజెపి మతతత్వ ధోరణితో స్వయంగా ఆ పార్టీకే చెందిన యువత ఏ విధంగా విసుగెత్తిపోయిందా చెప్పటానికి ఇవి రెండు ప్రత్యేకమైన దృష్టాంతాలు. జంతర్ మంతర్ వద్ద చేరిన వారెందరో, ఈ దేశ ప్రజలంతా ఒకటని, అందరి సమస్యలు ఒకటేనని, వాటి పరిష్కారానికి ప్రయత్నించకుండా ఈ తరహా ప్రచారాలు చేయటం తమను తప్పుదారి పట్టించి ఓట్లు సంపాదించేందుకు మాత్రమేననటం ఎందరో గమనించి ఉంటారు. బిజెపి ప్రచారాయుధాలలో ఈ నినాదాలు ఒకటై, ముఖ్యంగా యువతరాన్ని ప్రభావితం చేసేందుకు వారు ప్రయత్నిస్తున్న స్థితిలో, అదే యువతరం నుంచి ఇటువంటి వ్యతిరేకత కనిపించటం ఆ పార్టీ నాయకత్వాన్ని తీవ్రమైన కలవరపాటుకు గురిచేసి ఉంటుంది. పరిస్థితి ఇదే విధంగా కొనసాగితే మరింత ప్రమాదకరం కాగలదన్న జంకు కూడా నాయకత్వాన్ని రాజీపడేట్లు చేసి ఉంటుంది.ఈ ఒత్తిడికి అదనంగా చేరింది మరొకటి ఉంది. అది, ఆందోళనకారులను మొదటినుంచే టెర్రరిస్టులు, పాకిస్థాన్ ఏజెంట్లు, దేశద్రోహులు, హిందూ వ్యతిరేకులు, వారికి బయటినుంచి నిధులు వస్తున్నాయనే మాటలు. అదంతా కూడా హిందూ ముస్లిం, మందిర్ మస్జిత్, ఇండియా పాకిస్థాన్ షరా మామూలు ప్రచారపు ఫ్రేమ్ వర్క్‌లో భాగమని గ్రహించేందుకు యువతీ యువకులకు ఎక్కువ సమయం పట్టలేదు. దానితో ఒకవైపు బిజెపి వ్యతిరేకత పెరగటంతోపాటు, మత తారతమ్యాలు లేకుండా భారతీయులంతా ఒకటేనన్న భావం వేగంగా బలపడింది. అందువల్ల బిజెపి వ్యూహం రైతుల ఆందోళన సమయంలో బెడిసిన దాని కన్న చాలా ఎక్కువగా జంతర్ మంతర్ ఆందోళన సందర్భంగా అక్కడనే గాక దేశమంతటా బెడిసికొట్టింది. '

నవ సంఘర్షణ
తెలుగు దినపత్రిక
ఆదివారం 2-08-2026

# మంథని నుండి జేఎన్టీయూ కళాశాలకు బస్సులు నడపండి

**మంథని, ఆగస్టు 01నవ సంఘర్షణ**
రామగిరి మండలం పన్నూరు గ్రామంలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ హైదరాబాద్ మంథని యూనివర్సిటీ కళాశాలకు మంథని బస్టాండ్ నుండి కళాశాల ప్రారంభ ముగింపు సమయాలకు బస్సులు నడపాలని కోరుతూ కళాశాల విద్యార్థులు వారి తల్లిదండ్రులు, సిబ్బంది రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ను,మంథని బస్సు డిపో మేనేజర్లను మంథనిలో కలసి వినతి పత్రం సమర్పించారు. అదేవిధంగా కరీంనగర్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్, డిప్యూటీ రీజినల్ మేనేజర్లకు వాట్సాప్ ద్వారా వినతి పత్రం పంపించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, సిబ్బంది మాట్లాడుతూ మంథని పట్టణం పరిసర ప్రాంతాల నుండి దాదాపు 20 మంది విద్యార్థిని విద్యార్థులు, 25మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఇతర సిబ్బంది ఆర్టీసీ బస్సుల ద్వారా సెంట్నరీ కాలనీ పన్నూరు ఎక్స్ రోడ్ వరకు ప్రయాణిస్తున్నామన్నారు. బస్సు దిగిన తర్వాత పన్నూరు ఎక్స్ రోడ్ నుండి కళాశాల వరకు దాదాపు కిలోమీటన్నర దూరం నడవవలసి వస్తుందన్నారు. ఎండాకాలం, చలికాలం, వర్షాకాలంలో చాలా ఇబ్బందులకు గురవుతున్నామని, మహిళా సిబ్బంది విద్యార్థినీలు నడిచి వెళ్లడం వల్ల సకాలంలో క్లాసులకు, డ్యూటీలకు వెళ్లలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాల విద్యార్థులు పడుతున్న



బాధలను విద్యార్థులు వారి తల్లిదండ్రులు, సిబ్బంది జేఎన్టీయూ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి. విష్ణు వర్ధన్ కు వ్యక్తిగతంగా కలిసి చెప్పుకోగా వెంటనే వారి అవస్థలను అర్థం చేసుకున్న ఆయన మంత్రి శ్రీధర్ బాబుకు, ఆర్టీసీ కరీంనగర్ రీజినల్ మేనేజర్ కు, మంథని బస్ డిపో మేనేజర్ కు వినతి పత్రాలను విద్యార్థుల తల్లిదండ్రులు, సిబ్బంది ద్వారా అందజేయించారు. మంథని నుండి పెద్దపల్లి మార్గంలో వయా జేఎన్టీయూ కళాశాల మీదుగా బస్సు సర్వీసును ఏర్పాటు చేయాలని ఆయన అభ్యర్థించారు.
జేఎన్‌టీయూహెచ్ యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ మంథని నుండి గణనీయ సంఖ్యలో విద్యార్థులు, సిబ్బంది మంథనికి, పెద్దపల్లికి తమ రోజువారీ ప్రయాణం కోసం ఆర్టీసీ ప్రజా రవాణాపై ఆధారపడతారని తెలియజేశారు. ప్రస్తుతం, సరైన బస్సు సర్వీసులు లేకపోవడం వల్ల తమ కళాశాల విద్యార్థులు,సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఈ సమయాల్లో, క్రమరహిత రవాణా సౌకర్యాలు, సరిపోని బస్సు షెడ్యూళ్ల కారణంగా విద్యార్థులు, సిబ్బంది కళాశాలకు సమయానికి చేరుకోవడంలో సవాళ్లను ఎదుర్కొంటున్నారని వీరిలో ఎక్కువ మంది మహిళా సిబ్బంది, విద్యార్థినిలు ఉన్నారని ఆయన లేఖలో పేర్కొన్నారు.ప్రస్తుతం వారు పన్నూర్ ఎక్స్ రోడ్ వద్ద దిగి, కళాశాలకు చేరుకోవడానికి చాలా దూరం నడుస్తున్నారని ఇది వారికి చాలా కష్టంగా,అసురక్షితంగా మారుతోందన్నారు. కావున ఆర్టీసీ అధికారులు ఈ సమస్యలను దృష్టిలో పెట్టుకొని కళాశాల విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా ఈ న్యాయమైన అవసరాన్ని సానుభూతితో పరిగణించి, మీకు వీలైనంత త్వరగా నిర్దేశిత మార్గంలో
ఉదయం కళాశాల ప్రారంభ సమయంలో సాయంత్రం కళాశాల విడుదల సమయంలో ఇటు మంథని అటు పెద్దపల్లి మార్గంలో టిజిఎస్ఆర్‌టిసి బస్సు సర్వీసులను క్రమం తప్పకుండా ఏర్పాటు చేయవలసిందిగా ప్రిన్సిపల్ డాక్టర్ బి. విష్ణువర్ధన్, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, సిబ్బంది అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్లు సింగారపు శివరామకృష్ణ, ఎస్ కుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు పెండ్యాల రామ్ కుమార్, చెన్నోజు రమేష్, ఏరువాక శ్రీనివాస్, విద్యార్థులు పెండ్యాల శ్రీనిధి, చిన్నోజు అఖిల సిబ్బంది మాడిశెట్టి లక్ష్మి నారాయణ, చల్ల మనోహర్ రెడ్డి, తిరుపతి లతోపాటు పలువురు పాల్గొన్నారు..

## పంటల భీమా నమోదుకు గడువు పొడిగింపు..



**రాప్తాడు, ఆగస్టు 01నవ సంఘర్షణ**
ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) కింద పంటల బీమా నమోదు చేసుకునేందుకు ఆగస్టు 15వ తేదీ వరకు అవకాశం ఉందని మండల వ్యవసాయ శాఖ అధికారి కృష్ణచైతన్య తెలిపారు. రాప్తాడు మండల వ్యవసాయ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం పంటల బీమా నమోదు గడువును పొడిగించడం రైతులకు ఎంతో ప్రయోజనకరమని అన్నారు. పీఎంఎఫ్‌బీవై పథకం కింద కంది, వరి, జొన్న, మొక్కజొన్న, మిరప, ఆముదం, శనగ, సజ్జలు, కొర్ర, ఎర్రగడ్డ తదితర పంటలకు బీమా సౌకర్యం అందుబాటులో ఉందని తెలిపారు. ఇప్పటి వరకు పంటల బీమా నమోదు చేయించుకోని రైతులందరూ ఈ అవకాశాన్ని తప్పనిసరిగా సద్వినియోగం చేసుకుని ఆగస్టు 15లోగా బీమా నమోదు పూర్తి చేసుకోవాలని కృష్ణచైతన్య సూచించారు.

## తల్లి ముర్రుపాలే శిశువుకు తొలి టీకా..

**ఐసీడీఎస్ సూపర్వైజర్ లీలావతి**



**రాప్తాడు, ఆగస్టు 01నవ సంఘర్షణ**
పుట్టిన శిశువుకు తల్లి ముర్రుపాలే అత్యుత్తమమైన ఆహారం, ఆరోగ్యానికి తొలి రక్షణ అని ఐసీడీఎస్ సూపర్వైజర్ లీలావతి పేర్కొన్నారు. రాప్తాడు మండల కేంద్రంలోని సెక్టార్-1 అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు, బాలింతలు, గ్రామ మహిళలతో కలిసి అవగాహన ర్యాలీ చేపట్టారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో సూపర్వైజర్ లీలావతి మాట్లాడుతూ, శిశువు జన్మించిన గంటలోపే తల్లి ముర్రుపాలు పట్టించాలని సూచించారు. ముర్రుపాలే శిశువుకు తొలి టీకా వంటివని, తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారమని తెలిపారు. ఆరు నెలల వయస్సు వచ్చే వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, ఇతర పాలు ఇవ్వకూడదని చెప్పారు. తల్లిపాలు ఇవ్వడం వల్ల తల్లులకు రొమ్ము క్యాన్సర్ వచ్చే ప్రమాదం కూడా తగ్గుతుందని తెలిపారు. ఆరు నెలల తర్వాత తల్లిపాలతో పాటు అదనపు పోషకాహారాన్ని అందించాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే బాలామృతం, పాలు, గుడ్లు పిల్లల ఎదుగుదలకు ఎంతో ఉపయోగపడతాయని వివరించారు. ఇంట్లో ఆకుకూరలు, కూరగాయలను ఉడికించి మెత్తగా చేసి పిల్లలకు తినిపించాలని, బయట లభించే జంక్‌ఫుడ్, బిస్కెట్లు, చాక్లెట్లు, కేకులు, శీతల పానీయాలను చిన్నారులకు ఇవ్వకూడదని సూచించారు. అనంతరం చిరుధాన్యాలు, సెనగలు, నువ్వులు, వేరుసెనగలతో తయారుచేసిన పోషక లడ్డూలను పిల్లలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సెక్టార్-2 సూపర్వైజర్ శ్రీవాణి, పాఠశాల ఉపాధ్యాయులు నందిని, సరస్వతి, సంజీవమ్మ, అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మి, లక్ష్మీదేవి, సావిత్రి, భారతి, ముత్యాలమ్మ, హెల్పర్ సుశీలతో పాటు గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

## పంటల బీమా గడువు ఆగస్టు 15 వరకు పొడిగింపు..

**రైతులు సద్వినియోగం చేసుకోవాలి : ఏడీఏ సత్యనారాయణ**



**ఉరవకొండ రూరల్, ఆగస్టు 01నవ సంఘర్షణ**
ఎల్‌నినో వంటి ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో దిగుబడి ఆధారిత పంటల బీమా నమోదు గడువును ఈ నెల 15వ తేదీ వరకు పొడిగించినట్లు ఉరవకొండ వ్యవసాయ డివిజన్ సహాయ సంచాలకులు సత్యనారాయణ తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రకృతి వైపరీత్యాలు, తుఫానులు, కరువు, అకాల వర్షాల వల్ల పంట దిగుబడి దెబ్బతిన్నప్పుడు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ద్వారా రైతులకు ఆర్థిక భద్రత లభిస్తుందని చెప్పారు. ఎంపిక చేసిన పంటలను సాగు చేస్తున్న రైతులు ఆగస్టు 15లోగా ప్రీమియం చెల్లించి బీమా నమోదు చేసుకోవాలని సూచించారు. దిగుబడి ఆధారిత పంటల బీమా కింద రైతు వాటా ప్రీమియంగా కంది పంటకు ఎకరానికి రూ.80, ఎర్ర మిరపకు రూ.576, జొన్నకు రూ.84, మొక్కజొన్నకు రూ.132, ఆముదానికి రూ.80 చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. పంట కోత ప్రయోగాల ద్వారా లెక్కించిన వాస్తవ దిగుబడిని, గత ఏడు సంవత్సరాల సగటు ఆధారంగా నిర్ణయించిన హామీ దిగుబడితో పోల్చి నష్టం శాతాన్ని నిర్ధారించి పరిహారం అందజేస్తారని తెలిపారు. ఈ-క్రాప్ బుకింగ్‌లో ప్రతి రైతు తన పంట వివరాలు తప్పకుండా నమోదు అయ్యేలా చూసుకోవాలని సూచించారు. ఉరవకొండ వ్యవసాయ డివిజన్ పరిధిలో జూలై 31 నాటికి దిగుబడి ఆధారిత పంటల బీమా కింద 30,254 మంది రైతులు 49,523 హెక్టార్లకు ప్రీమియం చెల్లించగా, వాతావరణ ఆధారిత పంటల బీమా కింద 8,666 మంది రైతులు 13,082 హెక్టార్లకు ప్రీమియం చెల్లించినట్లు సత్యనారాయణ వెల్లడించారు.

## ఇండస్ట్రియల్ పార్క్ ఏరియా ను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**-ఈ నెల 3వ తేదీన మంత్రి పర్యటనకు రంగం సిద్ధం**

**-బహుళ పరిశ్రమల ప్రతినిధులతో మంత్రి పర్యటన**





**రామగిరి, ఆగస్టు 01నవ సంఘర్షణ**
రామగిరి మండలం రత్నాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని మేడిపల్లి-రామగిరిఖిల్లా ప్రాంతంలోని ఇండస్ట్రియల్ పార్క్ ఏరియా ను శనివారం పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పరిశీలించారు. ఈ నెల 3వ తేదీన రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు బహుళ పరిశ్రమల ప్రతినిధులతో ఈ ప్రాంతంలో పర్యటించనున్నారు. రామగిరి ఖిల్లా ప్రాంతంలో సుమారు 250 ఎకరాల ప్రభుత్వ, పట్టా భూములను తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రా స్ట్రక్చర్ ఆధ్వర్యంలో భూసేకరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా పలు పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి మంత్రి శ్రీధర్ బాబు సుముఖంగా ఉన్నారు. ఈ క్రమంలో పలువురు ప్రతినిధులతో ఈ ప్రాంతంలో పర్యటించనున్న దృష్ట్యా ముందస్తుగా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఈ ప్రాంతంలో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పల్లె ప్రతిమపివీరావు, ఆర్డీఓ కాసబోయిన సురేష్, తహసీల్దార్ పర్నంది సుమన్, మంథని డిఎల్ పిఓ మారుపట్ల కొమురయ్య, ఎంపీఓ మూల సమ్మిరెడ్డి,ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పవన్ కుమార్, చీఫ్ ఇంజనీర్ నరేందర్ రెడ్డి, జోనల్ మేనేజర్ మహేశ్వర్, ప్రాజెక్ట్ ఇంజనీర్ సృజన్ కుమార్, ప్రాజెక్ట్ ఇంజనీర్ రెహమాన్, ఆర్ఐ కె.మహేష్, సెక్రటరీ గంగుల సంతోష్, జిపిఓ పేరుక వెంకటేశ్వర్లు, వార్డ్ సభ్యులు, స్థానిక నాయకులు అల్లి రమేష్, బత్తిని ప్రశాంత్, పున్నం మణితేజ, కండె పోశం, బోగే సతీష్, పబ్బ మొగిలి, తన్నీరు ప్రదీప్, పీట్ల శేఖర్, బోగే ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

## మా.. భవిష్యత్తుకు హామీ ఏది..??




**మహబూబాబాద్:- ఆగస్టు 01నవ సంఘర్షణ**
గత 20 సంవత్సరాలుగా ఉపాధి హామీ పథకం (వీబిగ్రామ్జీ) లో పని చేస్తున్న నేటి వరకు ఉద్యోగ భద్రత లేదు, సరియైన సమయానికి వేతనం లేదు.., కనీస వేతనం అమలు కావడం లేదు., ప్రతి రోజు టార్గెట్స్ రివ్యూ చేస్తున్నారు తప్పా.., మా సంక్షేమం గురించి ఆలోచించడంలేదు.. అని ఆరోపిస్తూ వీబిగ్రామ్జీ ఉద్యోగులు నిరసన కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. మహబూబాబాద్ జిల్లాకేంద్రం లో సమావేశం నిర్వహించి తమ కార్యాచరణ ప్రణాళికను ప్రకటించారు. ఈ..సమావేశం లో జిల్లా జేఏసి చైర్మన్ పార్థసారథి, కన్వీనర్స్ ఎడ్ల యాకాంబరం, బన్సీలాల్, క్రిష్ణ, కీర్య, రంజిత్, జిల్లా కార్యాలయ సిబ్బంది, అన్ని మండలాల ఏపిఓ లు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, బియప్ టిఎస్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## రూపాయి ఫౌండేషన్ సాముహిక వివాహ మహోత్సవాలు

**-పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్త.**



**హైదరాబాద్; ఆగస్టు 01నవ సంఘర్షణ**
సమాజ సేవే లక్ష్యంగా వికలాంగులు పేద, నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న రూపాయి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వివాహ మహోత్సవాల పోస్టర్‌ను సచివాలయం లో మంత్రి కార్యాలయం లో రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి, గిరిజన సంక్షేమం, దివ్యాంగులు, వృద్ధులు, ట్రాన్స్‌జెండర్ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్త ఘనంగా ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ, వివాహం ప్రతి కుటుంబ జీవితంలో అత్యంత పవిత్రమైన ఘట్టమని, ఆర్థిక ఇబ్బందుల కారణంగా తమ పిల్లల వివాహాలను జరపలేక ఇబ్బందులు పడుతున్న వికలాంగులకు పేదల కుటుంబాలకు రూపాయి ఫౌండేషన్ అందిస్తున్న సహాయం ఎంతో గొప్పదని కొనియాడారు. సేవా దృక్పథంతో ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందిస్తూ, సమాజంలో సేవా భావం కలిగిన ప్రతి ఒక్కరూ ఇలాంటి కార్యక్రమాలకు సహకరించాలని పిలుపునిచ్చారు.తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన 50 వికలాంగులు నిరుపేద జంటలకు ఈ సామూహిక వివాహ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు నాగమల్ల అనిల్ కుమార్ - అరుణ, గుత్తికొండ కిరణ్ - లక్ష్మి, నిర్వాహకులు తెలిపారు. వివాహానికి అవసరమైన అన్ని ఏర్పాట్లతో పాటు వధూవరులకు అవసరమైన సామగ్రిని కూడా అందించనున్నట్లు వెల్లడించారు. సమాజంలోని దాతలు, సేవాభావం కలిగిన వ్యక్తులు ఈ మహత్తర కార్యక్రమానికి సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు.లక్ష్మి గార్డెన్స్, చంపాపేట్, హైదరాబాద్.18-11-2026, ఉ॥ గం. 11-11 ని.లకు,అని తెలిపారు.

## తల్లి పాలే పుట్టిన బిడ్డకు అమృతం!

**-మరిపెడ ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిని ఎం. ఎల్లమ్మ,**



**/మరిపెడ :ఆగస్టు 01నవ సంఘర్షణ**
శిశువుకు తల్లిపాలే అమృతమని, పుట్టిన వెంటనేబిడ్డకుఅందించే ముర్రుపాలే ప్రకృతి ప్రసాదించిన తొలి టీకా అని ఇవి అమృతంతో సమానమని,మరిపెడ ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిని ఎం.ఎల్లమ్మ అన్నారు. శనివారం మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని హౌసింగ్ బోర్డు అంగన్వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల (ఆగస్టు 1 నుండి 7) ప్రారంభం సందర్భంగా గర్భిణీలు,బాలింతలకు స్థానిక ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ గుగులోతు. రవి తో కలిసి ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ! బిడ్డ పుట్టిన మొదటి గంటలోపు ఇచ్చే పసుపురంగుముర్రుపాలుఎంతోపవిత్రమైనవని, అన్నారు.శిశువులో రోగనిరోధక శక్తిని పెంచి భవిష్యత్తులో డయేరియా,నిమోనియా వంటి ప్రాణాంతక వ్యాధుల బారిన పడకుండా రక్షణ కవచంలా!కాపాడతాయని తెలిపారు. ఆరు నెలల వరకు బిడ్డకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలనిఅన్నారు.
తేనె,నీరుపట్టించాల్సినఅవసరంలేదన్నారు.
తల్లులుఎలాంటిమూఢనమ్మకాలనునమ్మకుండా! ముర్రుపాలను బిడ్డకు పట్టించాలని కోరారు. ఆరు నెలల తర్వాతఅదనపుపౌష్టికాహారంతో పాటు, కనీసంరెండేళ్లవరకుతల్లిపాలు ఇవ్వడం తో పిల్లల మేధోశక్తి,శారీరక ఎదుగుదలఅద్భుతంగాఉంటుందని,పేర్కొన్నారు.ఈకార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ వి. రాజ్యలక్ష్మి, ఏఎన్ఎం ఝాన్సీ, ఆశా కార్యకర్త లలిత, అంగన్‌వాడీ టీచర్లు జే. ఉమారాణి, రజిత, గర్భిణీ స్త్రీలు, బాలింతలుతదితరులు పాల్గొన్నారు.

## కీవ్‌పై మిస్సైళ్లు, డ్రోన్లతో దాడి..

**- 9 మంది మృతి, 22 మందికి గాయాలు**



**కీవ్: ఆగస్టు 01నవ సంఘర్షణ**
రష్యా మళ్లీ విరుచుకుపడింది. ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పై బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లతో దాడి చేసింది. శనివారం ఉదయం ఆ అటాక్ జరిగింది. ఆ దాడిలో 9 మంది మృతిచెందగా, 22 మంది గాయపడినట్లు తెలుస్తోంది. సోలోమియానస్కీ జిల్లాలో ఉన్న 5 అంతస్తుల రెసిడెన్షియల్ బిల్డింగ్ దెబ్బతిన్నది. ఆ బిల్డింగ్‌లో ఉన్న 35 మంది తరలించారు. డర్నిస్టికి జిల్లాలో జరిగిన దాడి వల్ల ఏడు మంది మృతిచెందగా, మరో 14 మంది గాయపడ్డారు. అటాక్ వల్ల ఇండ్లు కూలి మంటలు వ్యాపించాయి. ఆ ఘటనలో పలువురు ప్రాణాలు కోల్పోయారు. కీవ్ సమీపంలో ఉన్న మిలిటరీ పారిశ్రామిక కేంద్రాలు, లాజిస్టిక్ హబ్‌లను టార్గెట్ చేసినట్లు రష్యా పేర్కొన్నది. డజన్ల సంఖ్యలో క్షిపణులను వదిలినట్లు రష్యా చెప్పింది. శుక్రవారం రాత్రి హై ప్రిసిషన్ గ్రౌండ్, సీ లాంచ్డ్ వెపన్స్, లాంగ్ రేంజ్ డ్రోన్లతో అటాక్ జరిగినట్లు రష్యా మిలిటరీ శాఖ పేర్కొన్నది. మిస్సైళ్లు, డ్రోన్లు, రేడార్ సిస్టమ్స్, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ ఎక్విప్మెంట్ ఉన్న ప్రొడక్షన్, స్టోరేజీ కేంద్రాలను టార్గెట్ చేసినట్లు రష్యా చెప్పింది.

## బెంగాల్ సీఎంపై దాడికి కుట్ర..

**- జైషే ఉగ్రవాది ప్రియురాలు అరెస్ట్**



**కోల్‌కతా ఆగస్టు 01నవ సంఘర్షణ**
పశ్చిమ బెంగాల్ సీఎం సువేందు అధికారిపై దాడి కోసం కుట్ర పన్నారనే ఆరోపణలపై అనుమానిత జైష్ ఉగ్రవాది ప్రియురాలిని స్పెషల్ టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. రాజకీయ నాయకులు, ప్రముఖులను లక్ష్యంగా చేసుకునే హనీట్రాప్ నెట్‌వర్క్‌లో ఆమె భాగమని అనుమానిస్తున్నారు. బెంగాల్ సీఎం సువేందు అధికారిపై దాడికి జైష్-ఎ-మొహమ్మద్ కార్యకర్త హమీమ్ మండల్ ప్రణాళిక రచిస్తున్నట్లు బెంగాల్ పోలీసుల దర్యాప్తులో తెలిసింది. దీంతో పూర్బ బర్ధమాన్‌లో అతడ్ని అరెస్ట్ చేశారు.కాగా, హమీమ్‌తో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్న అతడి ప్రియురాలు అర్పితా సర్కార్ ఈ నెట్‌వర్క్‌లో భాగమని పోలీసులు అనుమానించారు. సీఎం సువేందు అధికారిపై దాడి కోసం రాజకీయ నాయకులు, ప్రముఖులను లక్ష్యంగా చేసుకుని హనీట్రాప్ చేసే ఎత్తుగడలు ఆమె వేస్తున్నట్లు హమీమ్ విచారణ వివరాలు, సాంకేతిక ఆధారాల ద్వారా తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో జార్ఖండ్‌లోని సాహిబ్‌గంజ్‌లో అర్పితను బెంగాల్ స్పెషల్ టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఫోరెన్సిక్ పరీక్ష కోసం ఆమె మొబైల్ ఫోన్, ఇతర డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ నెట్‌వర్క్‌లోని ఇతర వ్యక్తులను గుర్తించేందుకు అర్పిత కాల్స్ రికార్డులు, ఆర్థిక లావాదేవీలను కూడా విశ్లేషిస్తున్నారు. మరోవైపు ఈ నెట్‌వర్క్ ఎంత వరకు విస్తరించింది, ఇతర రాష్ట్రాల్లో కూడా వీరి కార్యకలాపాలు కొనసాగుతున్నాయా? అన్న దానిపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు. ఈ నేపథ్యంలో మరిన్ని అరెస్టులు జరిగే అవకాశమున్నదని వెల్లడించారు.

## కలిసొచ్చిన ఏడు..
## కోటీశ్వరుడు అయ్యాడు




**న్యూఢీల్లి ఆగస్టు 01నవ సంఘర్షణ**
నార్త్ కరోలినా రాష్ట్రం, బిస్కోలోని మాంట్‌గోమరీ కౌంటీలో నివసించే టోమాస్ మునోజ్ అనే వ్యక్తికి నంబర్ 7తో అనుబంధం ఉంది. ఎందుకంటే ఆయన పుట్టింది 1977వ సంవత్సరం 7వ తేదీ. అంతేకాదు పది డాలర్ల విలువైన 'ట్రిపుల్ రెడ్ 777 జాక్‌పాట్ అనే లాటరీ టికెట్‌ను కొనుగోలు చేశాడు. అతడు కొన్న ఈ టికెట్‌కు ఒక మిలియన్ డాలర్ల (సుమారు 9.5 కోట్లు) లాటరీ తగిలి జాక్‌పాట్ కొట్టాడు.నార్త్ కరోలినా ఎడ్యుకేషన్ ట్రిపుల్ రెడ్ 777 జాక్‌పాట్ లాటరీని కొత్తగా ప్రారంభించారు. క్యాండర్‌లోని సౌత్ (రాశీబ్ష్ట్ర) మెయిన్ స్ట్రీట్‌లో ఉన్న క్యాండర్ వీ మార్ట్‌లో 777 నంబర్ గల లాటరీని చూసి కచ్చితంగా కొనాలని నిర్ణయించుకున్నాడు. ఎందుకంటే పుట్టిన తేదీ 7, 77వ సంవత్సరం, 777 అవుతుంది కాబట్టి ఆ లాటరీని కొనుగోలు చేశానని తెలిపాడు. ఆ లాటరీ గెలుచుకోవడం ఆనందంగా ఉందని అన్నాడు. ఈ బహుమతిని ఇరవై సంవత్సరాల పాటు యాభైవేల డాలర్లు వాయిదాల రూపంలో లేదా ఒకేసారి ఆరు లక్షల డాలర్లు తీసుకోవాలని లాటరీవారు చెప్పారు. ఒకేసారి ఆరు లక్షల డాలర్లు తీసుకున్నాడు. దీంట్లో పన్నులు పోగా 3,96,060 డాలర్లు ఇంటికి తీసుకెళ్లాడు. క్లాసిక్ కార్లను కొనుగోలు చేసి వాటిని బాగుచేసే తన వృత్తిలోనే ఈ డబ్బును పెట్టుబడిగా పెడతానని ఆయన వెల్లడించారు. పాఠశాల నిర్మాణానికి సహాయపడటానికి ఈ లాటరీని ప్రారంభించామని నిర్వాహకులు తెలిపారు. లాటరీ ద్వారా సేకరించిన డబ్బులో మాంట్‌గోమరీ కౌంటీకే 2.6 మిలియన్ డాలర్లకు పైగా అందజేశామని వారు పేర్కొన్నారు.

# పాకిస్తానీయులు మెచ్చిన 'రామాయణ'



**న్యూఢీల్లి ఆగస్టు 01నవ సంఘర్షణ**
రణ్‌బీర్ కపూర్ రాముడిగా, సాయిపల్లవి సీతగా, యష్ రావణుడిగా నటిస్తున్న రామాయణ సినిమాను నితీష్ తివారీ రూపొందిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా ట్రైలర్‌ను జూలై 30న తెల్లవారు 5 గంటలకు బ్రహ్మామూర్తాన విడుదల చేశారు. ఈ ట్రైలర్ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటుంది. అంతేకాదు దాయాది దేశం పాకిస్తాన్‌లో కూడా ఈ ట్రైలర్ ప్రశంసలు పొందుతుంది. ఈ ట్రైలర్‌ను అక్కడి థియేటర్లలో ప్రదర్శిస్తున్నారు. దీంతో అక్కడి సినీప్రియులతో పాటు యూట్యూబర్స్, నిర్మాతలు ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు.పాకిస్తానీ ప్రముఖ యూట్యూబర్ మావియా ఉమర్ ఫారూఖీ రామాయణ ట్రైలర్ తన అంచనాలను మించిపోయిందని ప్రశంసించారు. నిర్మాణ విలువలు చూసి ఆశ్చర్యం వేసిందని పేర్కొన్నారు. ఇంతటి ఖరీదైన ప్రాజెక్టును బాలీవుడ్ ఎలా నిర్మిస్తుందని ప్రశ్న లేవనెత్తారు. వెయ్యి కోట్ల రూపాయలతో సినిమాను నిర్మిస్తున్నారని నివేదికలు తెలుపుతున్నాయని అన్నారు. నెటిజన్లు అది కాదని ఈ సినిమా రెండు భాగాలుగా సుమారు రూ. 4000 కోట్లకు పైగా భారీ బడ్జెట్‌తో తీస్తున్నారని తెలపడంతో అవునా అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇది భారతీయ, హిందూ ధర్మానికి సంబంధించిన సినిమా అయినప్పటికీ ట్రైలర్ చూశాక సినిమాను అభినందించలేకుండా ఉండలేకపోతున్నానని వెల్లడించారు. అదేవిధంగా ట్రైలర్‌లోని నటుల నటన, డైలాగులు బాగున్నాయని మెచ్చుకుంటున్నారు. ముఖ్యంగా రావణుడిగా రాక్‌స్టార్ యష్ (ఘింష్ట్ర), రణ్‌బీర్ కపూర్, సాయిపల్లవి నటనను ప్రత్యేకంగా ప్రశంసిస్తున్నారు. బాలీవుడ్‌లో ఈ చిత్రం ప్రతిష్ఠాత్మకంగా నిలుస్తుందని వారు అభిలషిస్తున్నారు. రెండు భాగాలుగా రానున్న ఈ సినిమా మొదటి పార్ట్ ఈ ఏడాది దివాళికి, రెండో పార్ట్ వచ్చే ఏడాది దివాళికి విడుదల చేస్తున్నారు. ఈ సినిమాను పాన్ వరల్డ్‌గా ప్రపంచవ్యాప్తంగా 40 భాషల్లో విడుదల చేస్తున్నారు. ఇతిహాస గాథ అయిన రామాయణ ఎన్నో తరాలకు స్ఫూర్తిగా నిలుస్తుంది. దీనిలోని ధర్మం, మర్యాద, ధైర్యం, కరుణ, మాట విలువ ఆదర్శాలే ఈ స్ఫూర్తికి కారణం.

# మళ్లీ ప్రారంభమైన అమర్‌నాథ్ యాత్ర..

**- బల్తాల్ మార్గం నుంచి మాత్రమే అనుమతి**



**న్యూఢీల్లి ఆగస్టు 01నవ సంఘర్షణ**
అమర్‌నాథ్ యాత్ర శనివారం తిరిగి ప్రారంభమైంది. వాతావరణం అనుకూలించడంతో బల్తాల్ మార్గంలో యాత్రను తిరిగి ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. గత నెలలో ప్రారంభమైన అమర్‌నాథ్ యాత్ర ఉత్సాహంగా కొనసాగుతోంది. అయితే, భారీ వర్షాలు, రోడ్లు దెబ్బతినడం, వాతావరణం అనుకూలంగా లేకపోవడం వంటి కారణాల వల్ల యాత్రను శుక్రవారం తాత్కాలికంగా నిలిపివేశారు. కానీ, శనివారం వర్షాలు తగ్గడం, వాతావరణం అనుకూలంగా ఉండటంతో యాత్రను తిరిగి ప్రారంభించారు.ఇదే సమయంలో రోడ్లకు కూడా మరమ్మతులు చేపట్టారు. ప్రస్తుతం బల్తాల్ మార్గంలో అమర్‌నాథ్ యాత్ర ప్రారంభమైందని, భక్తులను పవిత్ర మంచులింగాన్ని దర్శించుకునేందుకు అనుమతిస్తున్నామని అధికారులు వెల్లడించారు. అయితే, పహల్గాం మార్గం నుంచి సాగే యాత్రను అధికారులు ఇంకా నిలిపివేశారు. ఈ మార్గంలో వాతావరణం అనుకూలంగా లేకపోవడం, రోడ్ల మరమ్మతు పనులు సాగుతుండటంతో ప్రస్తుతానికి యాత్రను నిలిపివేసినట్లు తెలిపారు. ఇదే సమయంలో అనేక ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడటం వల్ల జమ్మూ-శ్రీనగర్ హైవేను అధికారులు మూసివేశారు. ఇది 250 కిలోమీటర్ల దూరం కలిగిన జాతీయ రహదారి. కాశ్మీర్‌ను, దేశమంతా కలిపి ఉంచే రహదారి ఇదే. ఈ రోడ్డు మార్గం దెబ్బతినడంతో భాగవతి నగర్ బేస్ క్యాంప్ నుంచి వెళ్లాల్సిన భక్తుల్ని కూడా అనుమతించడం లేదు. ఇంకా అక్కడి అనేక ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. గత నెల 3న ఈ యాత్ర ప్రారంభమైంది. ఇప్పటివరకు 4,50,000 మంది భక్తులు పవిత్ర గుహలోని మంచులింగాన్ని దర్శించుకున్నారు. ప్రతి ఏడాదికోసారి సాగే అమర్‌నాథ్ యాత్ర ఈ నెల చివరి వరకు కొనసాగనుంది.

## అయోధ్య మెడికల్ కాలేజీలో కలకలం..
# బాంబు తయారీ పత్రం లభ్యం



**లక్నో ఆగస్టు 01నవ సంఘర్షణ**
ఉత్తరప్రదేశ్ అయోధ్యలోని మెడికల్ కాలేజీలో బాంబు తయారీకి సంబంధించిన పత్రం బయటపడింది. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు ఒక వైద్య విద్యార్థిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటన ఆ మెడికల్ కాలేజీలో కలకలం రేపింది. అయోధ్యలోని రాజర్షి దశరథ్ అటానమస్ స్టేట్ మెడికల్ కాలేజీలోని ఎక్స్-రే గదిలో బాంబు తయారీకి సంబంధించిన సూచనలు ఉన్న కాగితాన్ని ఆ విభాగపు ఇన్‌చార్జి శనివారం గుర్తించారు. చేతితో రాసిన ఆ కాగితంలో పేలుడు పదార్థం తయారీకి కావలసిన వివరాలు ఉన్నాయి. గేజ్ వైర్, అమ్మోనియం కార్బోనేట్, రెడ్ ఫాస్ఫరస్, రెడ్ సల్ఫైడ్, నైట్రిక్ యాసిడ్ వంటి వస్తువుల జాబితా కూడా ఉన్నది.కాగా, చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ (సీఎంఎస్) డాక్టర్ అరవింద్ సింగ్ దీని గురించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు అక్కడకు చేరుకుని ఆ కాగితాన్ని పరిశీలించారు. శుక్రవారం రాత్రి ఎక్స్-రే గదిలో విధుల్లో ఉన్న మొదటి సంవత్సరం వైద్య విద్యార్థి సర్ఫరాజ్ ఈ పత్రాన్ని రూపొందించినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ఉత్తరప్రదేశ్‌లోని బలరాంపూర్‌కు చెందిన అతడ్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సర్ఫరాజ్‌తో పాటు విధుల్లో ఉన్న మరో ఇద్దరిని కూడా విచారిస్తున్నారు. దీనిపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు. మరోవైపు ఈ సంఘటనతో మెడికల్ కాలేజీ యాజమాన్యం అప్రమత్తమైంది. కాలేజీ క్యాంపస్‌లో నిఘా పెంచాలని, ప్రాంగణంలోని భద్రతా ఏర్పాట్లపై సమీక్ష జరుపాలని సిబ్బందిని ఆదేశించింది. అలాగే 2025 నవంబర్‌లో ఢిల్లీలో జరిగిన పేలుడు ఘటనను ఇది గుర్తుకు తెచ్చింది. ఆ కేసులోని ముగ్గురు ప్రధాన నిందితులు ఫరీదాబాద్‌లోని అల్ ఫలా యూనివర్సిటీ ఉద్యోగులు కావడం గమనార్హం.

# 30 మంది విద్యార్థినులు ఆసుపత్రిపాలు..

**ఆ స్కూల్‌కు దెయ్యం పట్టిందంటూ వదంతులు**




**కోల్‌కతా ఆగస్టు 01నవ సంఘర్షణ**
ఒక స్కూల్‌కు చెందిన సుమారు 30 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, కండరాల నొప్పులు, అసాధారణ శారీరక కదలికలతో ఆ బాలికలు ఇబ్బందిపడ్డారు. వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అయితే ఆ స్కూల్‌కు దెయ్యం పట్టిందంటూ వదంతులు వ్యాపించాయి.పశ్చిమ బెంగాల్‌లోని ఉత్తర 24 పరగణాల జిల్లాలో ఈ సంఘటన జరిగింది. సందేశ్‌ఖాలిలో ప్రభుత్వ సహాయం పొందే ఫుల్మోని ఆదర్శ విద్యామందిర్‌లో శుక్రవారం వింత సంఘటన జరిగింది. 9వ తరగతికి చెందిన సుమారు 30 మంది బాలికలు స్కూల్ సమయంలో ఒకరి తర్వాత ఒకరు అస్వస్థతకు గురయ్యారు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, కండరాల నొప్పులు, అసాధారణ శారీరక కదలికలతో బాధపడ్డారు. ఆ విద్యార్థినులను తొలుత స్థానిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. ఆ తర్వాత మెరుగైన చికిత్స కోసం మీనాఖా గ్రామీణ ఆసుపత్రికి తరలించారు.కాగా, ఈ సంఘటన స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల్లో భయాందోళనలు కలిగించింది. ఆ స్కూల్‌కు 'దెయ్యం పట్టడమే' దీనికి కారణమన్న వదంతులు వ్యాపించాయి. ఈ నేపథ్యంలో సందేశ్‌ఖాలీ ఎమ్మెల్యే సనత్ సర్దార్ ఆ పాఠశాలను సందర్శించారు. అస్వస్థతకు గురైన కొందరు విద్యార్థినులను తన వాహనంలో ఆసుపత్రికి తరలించారు. మరోవైపు జిల్లా డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్, ఆరోగ్య శాఖ అధికారులు ఆ స్కూల్‌ను సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. విద్యార్థినుల ఆరోగ్యం గురించి ఆరా తీశారు. ప్రాథమిక చికిత్స తర్వాత చాలా మంది బాలికలు కోలుకున్నట్లు తెలిపారు. అయితే అవగాహన లేకుండా దెయ్యం వదంతులు వ్యాప్తి చేయవద్దని ఆరోగ్య శాఖ అధికారులు సూచించారు. బాలికల అనారోగ్య లక్షణాలను శాస్త్రీయ, వైద్యపరమైన కోణంలో పరిశీలించడంతోపాటు ఈ సంఘటనకు అసలు కారణాన్ని గుర్తించడంపై దృష్టి సారించినట్లు వెల్లడించారు.

# ఎర్రబస్సు రాదన్న చోటుకు ఎయిర్‌బస్సు వచ్చింది

**-ఇదీ ఉత్తరాంధ్ర దెబ్బ.. అర్థమైందారాజా**
**-మోడీజీ వికసిత్ భారత్..**
**సీబీఎన్ విజన్ ప్రతిరూపం భోగాపురం ఎయిర్‌పోర్ట్**
**-రాష్ట్ర అభివృద్ధికి గ్రోత్ ఇంజన్ ఉత్తరాంధ్ర**
**-అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ**
**విమానాశ్రయం ప్రారంభోత్సవ సభలో మంత్రి లోకేష్**

**విశాఖపట్నం: నవ సంఘర్షణ**
"కొందరు ఎర్రబస్సు రాని ఊరికి విమానాశ్రయం అవసరమా అని అన్నారు. ఉత్తరాంధ్రను తక్కువగా అంచనా వేసి ఇక్కడి ప్రజలను అవమానించిన వాళ్లకి ఈరోజు దిమ్మ తిరిగే సమాధానమే అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవం. ఎర్రబస్సు రాదు అన్న చోటికి ఎయిర్ పోర్ట్ వచ్చింది. ఎర్రబస్సు రాదు అన్నచోటికి ఎయిర్ బస్ వచ్చింది. ఎర్రబస్సు రాదు అన్న చోటికి ఏకంగా మన నమో వచ్చారు. ఇదీ ఉత్తరాంధ్ర దెబ్బ.. అర్థమైందా రాజా.." అంటూ రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ఉత్తేజభరితంగా ప్రసంగించారు. భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ సభలో ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తో కలసి మంత్రి లోకేష్ పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర కలలకు రెక్కలిచ్చిన నమో..

ఎయిర్ పోర్టు ఆవరణలో ఏర్పాటుచేసిన సభలో మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహావీరుడు అల్లూరి సీతా రామరాజు నడయాడిన గొప్ప నేల ఉత్తరాంధ్ర. ఈ రోజు నుంచి ఈ నేల చరిత్ర, పౌరుషం గురించి ప్రపంచం మొత్తం మాట్లాడుతుంది. ఈ రోజు కేవలం ఒక ఎయిర్ పోర్ట్ ప్రారంభం మాత్రమే కాదు. మన నమో వికసిత్



భారత్, మన సీబీఎన్ విజన్ కలిసిన రోజు. ఉత్తరాంధ్ర భవిష్యత్తు మారే రోజు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో దూసుకెళ్లే రోజు. ఈనేలపై స్వాతంత్ర్యం కోసం పోరాడింది అల్లూరి సీతారామ రాజు అయితే ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు ఇచ్చింది మన నమో. రైతుల త్యాగం, కార్మిక కష్టం, మన సీబీఎన్ విజన్‌కు ప్రతిరూపం ఈ విమానాశ్రయం. అల్లూరి సీతా రామరాజు కి ఉన్న పట్టుదల, పౌరుషం, దేశ భక్తి నాకు మన నమోలో కనిపిస్తుంది. నమో అంటే ధైర్యం, నమో అంటే విశ్వాసం, నమో అంటే సురక్షిత భారత్. నమో అంటే శత్రువు గుండెల్లో భయం, అభివృద్ధి, పేదల సంక్షేమం, భవిష్యత్తుకు భరోసా కోరుకునే వారికి ఒకే ఒక సమాధానం నమో అని లోకేష్ వ్యాఖ్యానించారు.

# బిజినెస్

## జూలైలో రూ.2 లక్షల కోట్లు దాటిన జీఎస్టీ కలెక్షన్లు..

### -15.4 శాతం పెరుగుదల

: జూలై నెలకు సంబంధించిన గూడ్స్ అండ్స్ సర్వీస్ ట్యాక్స్ (జీఎస్టీ) వసూళ్ల వివరాలు వెల్లడించింది కేంద్రం. జూలైలో రూ.2.11 లక్షల కోట్ల జీఎస్టీ వసూలైనట్లు కేంద్రం ప్రకటించింది. ఇందులో సెంట్రల్ జీఎస్టీ (సీజీఎస్టీ) వసూళ్లు రూ.39,835 కోట్లు, స్టేట్ జీఎస్టీ (ఎస్‌జీఎస్టీ) వసూళ్లు రూ.47,881 కోట్లుకాగా ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ (ఐజీఎస్టీ) వసూళ్లు రూ.1.23 లక్షలుగా ఉన్నాయి. ఏడాది ప్రాతిపదికన చూస్తే గతేడాది ఇదే నెలకు సంబంధించి జీఎస్టీ వసూళ్లలో 15.4 శాతం పెరుగుదల ఉంది. ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.2 లక్షల కోట్ల జీఎస్టీ వసూలు కావడం ఇది రెండోసారి.చివరగా గత ఏప్రిల్‌లో జీఎస్టీ వసూళ్లు రూ.2.43 లక్షల కోట్లు వచ్చాయి. ఈ వివరాల్ని కేంద్ర ఆర్థిక శాఖ శనివారం, ఆగష్టు 1న విడుదల చేసింది. జూలై నెలకు సంబంధించి రీఫండ్‌లు కూడా 13.1 శాతం పెరిగి, రూ.29,968 కోట్లకు చేరాయి. విదేశీ దిగుమతుల ద్వారా జీఎస్టీ రెవెన్యూ 28.8 శాతం పెరిగింది. వరుసగా జీఎస్టీ వసూళ్లు పెరుగుతుండటం దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధికి




సంకేతం అని నిపుణులు అంటున్నారు. జీఎస్టీ వసూళ్లలో హరియాణా అత్యధిక వృద్ధి సాధించింది. అదే సమయంలో గుజరాత్ రెండో స్థానంలో, తెలంగాణ కూడా భారీ వృద్ధి (19 శాతం) నమోదు చేసింది. మరోవైపు ఫిక్స్‌డ్ డిపాజిట్ రేట్లపై ఆర్బీఐ అక్టోబర్ 1 నుంచి కొత్త రూల్స్ అమలు చేయనున్నట్లు చెప్పింది. +వశీస్త్రతీఖజూష్త్రఱఅష Reference దీనిప్రకారం.. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (కమర్షియల్ బ్యాంక్స్-ఇంటరెస్ట్ రేట్ ఆన్ డిపాజిట్స్) సెకండ్ అమెండ్‌మెంట్ డైరెక్షన్స్, 2026 ప్రకారం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఏదైనా ఒక రోజున కస్టమర్లు డిపాజిట్ చేసే మొత్తాలకు, ఒక అమౌంట్‌కు అన్ని బ్రాంచులలో ఒకే వడ్డీ రేటు చెల్లించాలని ఆదేశించింది. బల్క్ డిపాజిట్లతోపాటు అన్ని రకాల డిపాజిట్లపై వేర్వేరు బ్రాంచుల్లో అయినా సరే ఒక అమౌంట్‌కు, ఒకే రకమైన వడ్డీ చెల్లించాలని, ఈ విషయంలో వివక్ష ఉండకూడదని కూడా ఆర్బీఐ ఆదేశించింది.

## జులైలో యూపీఐ లావాదేవీలకు కొత్త రికార్డు..

### - రూ.29.88 లక్షల కోట్ల విలువైన ట్రాన్సాక్షన్లు




దేశంలో డిజిటల్ చెల్లింపులు మరింత వేగంగా విస్తరిస్తున్నాయి. జులై నెలలో యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ లావాదేవీలు సరికొత్త రికార్డు నమోదు చేశాయి. ఈ ఏడాది జులైలో మొత్తం 23.66 బిలియన్ యూపీఐ లావాదేవీలు జరిగాయని, వాటి విలువ రూ.29.88 లక్షల కోట్లుగా నమోదైందని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వెల్లడించింది. గత ఏడాది జులైతో పోలిస్తే లావాదేవీల సంఖ్య 22 శాతం, మొత్తం విలువ 19 శాతం పెరిగినట్లు ఎన్‌పీసీఐ తెలిపింది. జులైలో రోజుకు సగటున 76.3 కోట్ల యూపీఐ లావాదేవీలు జరగగా, వాటి విలువ రూ.96,383 కోట్లుగా నమోదైంది. చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో కూడా యూపీఐ సేవలు వేగంగా విస్తరించడం, డిజిటల్ చెల్లింపులపై ప్రజల్లో పెరుగుతున్న అవగాహన, స్మార్ట్‌ఫోన్ వినియోగం అధికం కావడం వల్లే ఈ స్థాయిలో లావాదేవీలు నమోదైనట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.

## 3 నిమిషాల్లోనే అమ్ముడైన రాయల్ ఎన్ఫీల్డ్ స్పెషల్ ఎడిషన్ బైక్

రాయల్ ఎన్ఫీల్డ్ అభిమానులకు ప్రత్యేకంగా రూపొందించిన షాటగన్ 650 స్పెషల్ ఎడిషన్ బైక్‌కు ప్రపంచవ్యాప్తంగా విశేష స్పందన లభించింది. ఈ లిమిటెడ్ ఎడిషన్ మోడల్ విక్రయాలు ప్రారంభమైన కేవలం మూడు నిమిషాల్లోనే భారత మార్కెట్‌కు కేటాయించిన 25 బైక్‌లు పూర్తిగా అమ్ముడయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా కేవలం 100 యూనిట్లను మాత్రమే తయారు చేసిన ఈ ప్రత్యేక మోడల్‌ను తైవాన్‌కు చెందిన ప్రముఖ కస్టమ్ మోటార్‌సైకిల్ బ్రాండ్ ఐకాన్ మోటార్‌స్పోర్ట్స్ సహకారంతో ప్రత్యేకంగా డిజైన్ చేశారు. ఈ స్పెషల్ ఎడిషన్ బైక్‌కు ప్రీమియం బ్లాక్ కలర్, ఆకర్షణీయమైన గోల్డ్ స్ట్రైప్స్, అలాగే ప్రతి బైక్‌కు ప్రత్యేక సీరియల్ నంబర్ అందించారు. దీంతో ఇది కలెక్టర్స్ ఎడిషన్‌గా మరింత ప్రత్యేకతను




సంతరించుకుంది. ఇంజిన్ పరంగా ఎలాంటి మార్పులు చేయలేదు. ఇందులో సాధారణ షాట గన్ 650లో ఉండే 648 సీసీ, ప్యారలల్-ట్విన్ ఇంజిన్నే కొనసాగించారు. ఈ ఇంజిన్ శక్తివంతమైన పనితీరుతో పాటు సాఫీ రైడింగ్ అనుభవాన్ని అందిస్తుంది.పరిమిత సంఖ్యలో విడుదల చేయడం, ప్రత్యేక డిజైన్, ప్రీమియం ఫినిషింగ్ కారణంగా ఈ స్పెషల్ ఎడిషన్ బైక్‌కు మార్కెట్లో భారీ డిమాండ్ ఏర్పడిందని కంపెనీ వర్గాలు తెలిపాయి.

# స్పోర్ట్స్

### సెంట్రల్ జోన్ సారథిగా పాటిదార్..

## స్క్వాడ్‌లో రింకూ, దూబే..!

ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరును వరసగా రెండుసార్లు ఛాంపియన్‌గా నిలిపిన రజత్ పాటిదార్ దేశవాళీ క్రికెట్లో బిజీ కానున్నాడు. త్వరలో మొదలయ్యే దులీప్ ట్రోఫీ లో పాటిదార్ సెంట్రల్ జోన్‌ను నడిపించాడు. ఈ ఐపీఎల్ విజేతను కెప్టెన్‌గా 15 మందితో కూడిన స్క్వాడ్‌ను ప్రకటించారు సెలెక్టర్లు. టీ20 చిచ్చరపిడుగు రింకూ సింగ్ వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు.దేశవాళీ సీజన్ 2026-27లో మొదటిదైన దులీప్ ట్రోఫీకి తెరలేవనుంది. ఇప్పటికే ఈస్ట్ జోన్, వెస్ట్ జోన్ తమస్క్వాడ్‌ను ప్రకటించాయి. శనివారం సెంట్రల్ జోన్ సెలెక్టర్లు ఐపీఎల్ విన్నర్ రజత్ పాటిదార్ కెప్టెన్‌గా పటిష్టమైన బృందాన్ని ఎంపిక చేశారు. రింకూ సింగ్‌కు వైస్ కెప్టెన్సీ అప్పగించిన సెలెక్టర్లు.. ఇటీవలే టీ20ల్లో అరంగేట్రం చేసిన యశ్ ఠాకూర్‌ను పేస్ దళంలోకి తీసుకున్నారు.శ్రీలంక పర్యటనకు ఎంపికైన సరాన్ష్ జైన్ ఆల్‌రౌండర్ కోటాలో చోటు దక్కించుకోగా.. వికెట్ కీపర్లుగా ఆర్యన్ జుయల్, కునాల్ సింగ్



రాథోడ్ స్క్వాడ్‌లోకి వచ్చారు. స్పిన్నర్ హర్ష్ దూబే కూడా 15మందిలో స్థానం సంపాదించాడు. జూలై 31న ఉజ్జయిని దేవాలయంలో మహాకాళేశ్వరుడిని కుటుంబం సమేతంగా దర్శించకున్నాడు పాటిదార్.ఆగస్టు 23 నుంచి బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఆగస్టు 23న దులీప్ ట్రోఫీ మొదలవ్వనుంది. డిఫెండింగ్ ఛాంపియన్నైన సెంట్రల్ జోన్ నేరుగా సెమీఫైనల్ ఆడనుంది. ఈస్ట్ జోన్, నార్త్ ఈస్ట్ జోన్ మ్యాచ్ విజేతను ఆగస్టు 30న పాటిదార్ సేన ఢీకొట్టనుంది. సెప్టెంబర్ 6వ తేదీన ఫైనల్ జరుగనుంది.

**సెంట్రల్ జోన్ స్క్వాడ్:** రజత్ పాటిదార్(కెప్టెన్), ఆర్యన్ జుయల్(వికెట్ కీపర్), సరాన్ష్ జైన్, అమన్ మొఖడె, కునాల్ ఛండేలా, జీషన్ అన్సారీ, ఆర్యన్ పాండే, అర్షద్ ఖాన్, రింకూ సింగ్(వైస్ కెపట?న్), ఆయుష్ పాండే, యశ్ రాథోడ్, హర్ష్ దూబే, కునాల్ సింగ్ రాథోడ్(వికెట్ కీపర్), యశ్ ఠాకూర్, నచికెట్ భుటే.

### ఆగస్టు 4న శ్రీలంకకు

## టీమిండియా..

### -ప్రాక్టీస్ మ్యాచ్ షెడ్యూల్ కుదింపు..!



ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ 2025-27లో కీలకమైన పర్యనటకు సిద్ధమవుతోంది టీమిండియా. రెండు టెస్టుల సిరీస్ కోసం భారత జట్టు ఆగస్టు 4వ తేదీన శ్రీలంక పర్యటనకు వెళ్లనుంది. తొలి టెస్టుకు ముందు శుభ్‌మన్ గిల్ సేన నాలుగు రోజులు ప్రాక్టీస్ మ్యాచ్ ఆడాల్సి ఉంది. అయితే.. అనుకోని కారణాల వల్ల షెడ్యూల్ మారింది. నాలుగు రోజుల కాస్త మూడు రోజులకు మారింది. ఇందుకు కారణం ఏంటనేది మాత్రం తెలియాల్సి ఉంది.శ్రీలంక పర్యటనకు భారత స్క్వాడ్ ప్రకటన సమయంలోనే నాలుగు రోజుల ప్రాక్టీస్ మ్యాచ్ ఉంటుందని బీసీసీఐ తెలిపింది. అయితే.. ఇప్పుడు షెడ్యూల్‌లో మార్పులు చేశామని, ప్రాక్టీస్ మ్యాచ్ మూడు రోజులకే పరిమితం కానుందని సమాచారం. షెడ్యూల్ ఎందుకు మారింది? అనేది మాత్రం తెలియడం లేదు. శుభ్‌మన్ గిల్, కోచ్ గౌతం గంభీర్ బృందం ఆగస్టు 4న శ్రీలంకకు వెళ్లనుంది. మూడు రోజుల ప్రాక్టీస్ మ్యాచ్ అనంతరం తొలి టెస్టుకోసం భారత జట్టు గాలే చేరుకోనుంది.
ఆగస్టు 15 వ తేదీన గాలే స్టేడియంలో మొదటి టెస్టు.. ఆపై ఆగస్టు 23న కొలంబోలో రెండో టెస్టులో ఇరుజట్లు తలపడనున్నాయి. ప్రస్తుతం ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్(ఔజ) ర్యాంకింగ్స్‌లో 5వ స్థానంలో ఉన్న గిల్ సేన.. ఈ రెండు మ్యాచుల్లో గెలిచినా టాప్-2లోకి వచ్చే అవకాశాలు తక్కువే. ఇంగ్లండ్ పర్యటనలో గాయపడిన ప్రధాన పేసర్ జస్ప్రీత్ బుమ్రా ఫిట్‌నెస్ పరీక్షలో పాసవ్వడం భారత పేస్ బలాన్ని పెంచనుంది. అయితే.. గాయం నుంచి కోలుకుంటున్న సాయి సుదర్శన్ ఈ టెస్టు సిరీస్‌కు అందుబాటులో ఉంటాడా? లేదా? అనేది తెలియాల్సి ఉంది.

**భారత టెస్టు స్క్వాడ్ :** శుభ్‌మన్ గిల్(కెప్టెన్), కేఎల్ రాహుల్(వైస్ కెప్టెన్), యశస్వీ జైస్వాల్, రిషభ్ పంత్(వికెట్ కీపర్), సాయి సుదర్శన్, ధ్రువ్ జురెల్(వికెట్ కీపర్), రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, మానవ్ సుతార్, సిరాజ్, ప్రసిధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్, దేవ్‌దత్ పడిక్కల్, సరాన్ష్ జైన్.

## జావెలిన్ త్రోలో నీరజ్ చోప్రాకు సిల్వర్..

### - యశ్వీర్ సింగ్‌కు కాంస్యం

గ్లాస్‌గో:
భారత జావెలిన్ స్టార్ త్రోయర్ నీరజ్ చోప్రా.. కామన్‌వెల్త్ క్రీడల్లో రజత పతకాన్ని గెలుచుకున్నాడు. ఇదే ఈవెంట్‌లో మరో ఇండియన్ అథ్లెట్ యశ్వీర్ సింగ్ కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు. తన చివరి త్రోతో యశ్వీర్ అనూహ్య రీతిలో మెడల్‌ను సొంతం చేసుకున్నాడు. టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణం గెలిచిన 28 ఏళ్ల నీరజ్ చోప్రా .. కామన్‌వెల్త్ గేమ్స్‌లో రెండో అటెంప్ట్‌లో 85.83 మీటర్ల దూరం జావెలిన్‌ను విసిరాడు. పాకిస్థాన్ అథ్లెట్ అర్షద్ నదీమ్ నుంచి గట్టి పోటీ ఉంటుందని భావించారు. కానీ పాక్ అథ్లెట్ అనుకోని రీతిలో నిష్క్రమించాడు. ఇటీవల వరల్డ్ చాంపియన్‌గా నిలిచిన శ్రీలంక అథ్లెట్ రుమేశ్ తరంగ పతిరగే సత్తా చాటాడు. అతను జావెలిన్‌ను 89.75 మీటర్ల దూరం విసిరి బంగారం పతకాన్ని కైవసం చేసుకున్నాడు.గ్లాస్‌గోలో ప్రస్తుతం చల్లని వాతావరణం ఉన్నది. బలమైన గాలులు కూడా వీస్తున్నాయి. ఇలాంటి వాతావరణంలో జావెలిన్‌ను సుమారు 90 మీటర్ల దూరం వరకు విసరడం అంత సులువైన అంశం కాదు. ఈ సీజన్‌లో జావెలిన్‌ను 90 మీటర్ల




మార్క్ దాటించిన ఏకైక క్రీడాకారుడి జాబితాలో రుమేశ్ తరంగ ఉన్నాడు. ఇక ఈవెంట్‌లో 24 ఏళ్ల యశ్వీర్ అసాధారణ ప్రతిభ కనబరిచాడు. తొలిసారి కామన్‌వెల్త్ గేమ్స్ ఆడుతున్న అతను.. అందర్నీ స్టన్ చేస్తూ తన జావెలిన్‌ను 85.41 మీటర్ల దూరం విసిరాడు. తన చివరి ఆరో ప్రయత్నంలో అతను ఆ దూరానికి జావెలిన్‌ను విసిరి ఇండియాకు పతకాల సంఖ్యను పెంచేశాడు.

# 'కొరియన్ కనకరాజు' ట్రైలర్ అదిరింది..

### -డ్యూయల్ షేడ్స్, కామెడీతో అంచనాలు పెంచిన వరుణ్




మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా, దర్శకుడు మేర్లపాక గాంధీ తెరకెక్కిస్తున్న ఇండో-కొరియన్ హారర్ కామెడీ ఎంటర్‌టైనర్ కొరియన్ కనకరాజు పై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, టీజర్, పాటలు ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని కలిగించగా.. తాజాగా విడుదలైన ట్రైలర్ సినిమాపై ఉన్న హైప్‌ను మరో స్థాయికి తీసుకెళ్లింది. తాజా ట్రైలర్‌ను బట్టి చూస్తే.. ఈ సినిమా పూర్తి స్థాయి కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందినట్లు తెలుస్తోంది. అనంతపురానికి చెందిన ఓ సాధారణ యువకుడు, కొరియన్ మాఫియా ప్రపంచం మధ్య జరిగే ఆసక్తికర పరిణామాలే కథకు ప్రధాన బలంగా కనిపిస్తున్నాయి. హారర్, కామెడీ, యాక్షన్ అంశాలను దర్శకుడు మేర్లపాక గాంధీ వినోదాత్మకంగా రూపొందించినట్టు ట్రైలర్ స్పష్టం చేస్తోంది. ఈ చిత్రంలో వరుణ్ తేజ్ రెండు విభిన్న షేడ్స్‌లో కనిపించనున్నట్లు ట్రైలర్ సూచిస్తోంది. ఒకవైపు అనంతపురం యువకుడిగా మాస్ బాడీ లాంగ్వేజ్‌తో అలరిస్తూనే, మరోవైపు కొరియన్ మాఫియా డాన్ పాత్రలో స్టైలిష్ లుక్, స్వాగ్‌తో ఆకట్టుకున్నారు. రెండు పాత్రలకు భిన్నమైన హావభావాలు, బాడీ లాంగ్వేజ్, మేకోవర్‌తో వరుణ్ తేజ్ చూపించిన వైవిధ్యం అభిమానులను ఆకట్టుకుంటోంది. ట్రైలర్‌లో నటుడు సత్య చెప్పిన పంచ్ డైలాగులు నవ్వులు పూయిస్తున్నాయి. ఆయన కామెడీ టైమింగ్ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని ట్రైలర్‌ను చూసిన ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. హీరోయిన్ రిథికా నాయక్ తన గ్లామర్, స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఆకట్టుకున్నారు. ఇప్పటికే విడుదలైన రెండు పాటలు మంచి ఆదరణ పొందగా, ట్రైలర్‌లో ఎస్. థమన్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ మరింత ఉత్సాహాన్ని కలిగిస్తోంది. ముఖ్యంగా యాక్షన్, హారర్ సన్నివేశాల్లో థమన్ సంగీతం సినిమాకు అదనపు బలంగా కనిపిస్తోంది. ఈ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. ట్రైలర్‌లో కనిపించిన విజువల్స్, సెట్స్, సాంకేతిక నాణ్యత సినిమాను భారీ స్థాయిలో తెరకెక్కించినట్లు తెలియజేస్తున్నాయి. ఆగస్టు 7న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానున్న 'కొరియన్ కనకరాజు' ఇప్పటికే మంచి పాజిటివ్ బజ్‌ను సొంతం చేసుకుంది. ట్రైలర్ విడుదల తర్వాత సినిమాపై ప్రేక్షకుల్లో అంచనాలు మరింత పెరిగాయి. హారర్, కామెడీ, యాక్షన్, ఎమోషన్‌లతో కూడిన పూర్తి స్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. ట్రైలర్‌కు వస్తున్న స్పందన చూస్తుంటే.. వరుణ్ తేజ్ ఖాతాలో మరో విజయవంతమైన చిత్రం చేరే అవకాశాలు కనిపిస్తున్నాయని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# టాక్సిక్' ట్రైలర్ డేట్ ఫిక్స్..

### -బాక్సాఫీస్ పై యష్ సునామీ!



కన్నడ రాకింగ్ స్టార్ యష్ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ పాన్ వరల్డ్ మూవీ 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్' చిత్రానికి సంబంధించి మేకర్స్ తాజాగా ఒక అదిరిపోయే అప్డేట్ అందించారు. సినిమా ప్రమోషన్స్ లో భాగంగా చిత్ర యూనిట్ తాజాగా ట్రైలర్ రిలీజ్ డేట్ ను అధికారికంగా ప్రకటించడంతో పాటు, ఒక సరికొత్త పోస్టర్ ను విడుదల చేసి సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చారు. గీతూ మోహన్ దాస్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న ఈ సాలిడ్ యాక్షన్ డ్రామాపై ఇప్పటికే సినీ వర్గాలలో భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. రీసెంట్ గా రామాయణ ప్రాజెక్ట్ తో పాటు రావణాసురుడి పాత్రలో యష్ గెటప్ మరియు ప్రెజెన్స్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆ సినిమా కంటే ముందే బాక్సాఫీస్ ముందుకు రాబోతున్న 'టాక్సిక్' తో యష్ ఏ స్థాయిలో విధ్వంసం సృష్టిస్తాడనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ క్రమంలో తాజాగా విడుదల చేసిన బ్లాక్ అండ్ వైట్ పోస్టర్ సినిమా మూడ్ ఏంటో స్పష్టంగా తెలియజేస్తోంది. ఈ పోస్టర్ తో పాటు మేకర్స్ అనౌన్స్ చేసిన వివరాల ప్రకారం, ఈ భారీ బడ్జెట్ యాక్షన్ ఎంటర్‌టైనర్ సినిమా ట్రైలర్ ను వచ్చే ఆగస్టు 8, 2026 న అత్యంత గ్రాండ్ గా లాంచ్ చేయనున్నారు. ఈ చిత్రంలో నయనతార, కియారా అద్వానీ, తారా సుతారియా, రుక్మిణి వసంత్, హ్యూమా ఖురేషి వంటి స్టార్ హీరోయిన్లు, నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ మరియు మాన్స్టర్ మైండ్ క్రియేషన్స్ సంయుక్తంగా అత్యంత భారీ బడ్జెట్ తో ఈ సినిమాను నిర్మిస్తున్నాయి. ఇక కేజీఎఫ్ లాంటి ఇండస్ట్రీ హిట్ తర్వాత కేవీఎన్ ప్రొడక్షన్స్ తో యష్ చేస్తున్న ఈ ప్రాజెక్ట్ పై ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలున్నాయి.



# నీట్ పేపర్ లీక్ వల్ల సర్వస్వాన్ని కోల్పోయాను

### -నటి మానుషి చిల్లర్

మాజీ ప్రపంచ సుందరి, బాలీవుడ్ నటి మానుషి చిల్లర్ తన విద్యార్థి దశలో నీట్ పేపర్ లీక్ అవ్వడం వలన పడ్డ కష్టాలను గుర్తుచేసుకుంటూ ఆసక్తికర విషయాలను పంచుకుంది. సోహా అలీ ఖాన్ నిర్వహించిన 'ఆల్ అబౌట్ హర్' యూట్యూబ్ టాక్ షోలో పాల్గొన్న ఆమె, 2015 నాటి వైద్య ప్రవేశ పరీక్ష (నీట్) పేపర్ లీక్ ఉదంతం తనపై ఎంత తీవ్రమైన మానసిక ప్రభావాన్ని చూపిందో వివరించారు. ఎంతో కష్టపడి ప్రిపేర్ అయిన తర్వాత పరీక్ష రద్దు కావడం, మళ్లీ రాయాల్సి రావడం తన జీవితంలోనే అత్యంత కఠినమైన కాలమని ఆమె తెలిపారు. వైద్య వృత్తిపై మక్కువతో తాను ఎంతో ఇష్టపడే కూచిపూడి నృత్యం, పెయింటింగ్ వంటి వాటిని ఒక సంవత్సర కాలం పాటు పూర్తిగా పక్కన పెట్టానని, తన సంతోషాలన్నింటినీ త్యాగం చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు ఇద్దరూ డాక్టర్లు కావడంతో మానసికంగా తనకు ఎంతో అండగా నిలిచారని, అయితే సాధారణ విద్యార్థులు పడే ఇబ్బందులను తాను ప్రత్యక్షంగా చూశానని మానుషి వెల్లడించారు. ఎంతోమంది విద్యార్థులు కోచింగ్ కోసం అప్పులు చేసి, వేరే నగరాలకు వెళ్లి చదువుకుంటున్నారని, అలాంటి సమయంలో పరీక్ష మళ్లీ రాయాల్సి రావడం వల్ల విద్యార్థులు ఎంతటి మానసిక ఒత్తిడికి గురవుతారో మాటల్లో చెప్పలేమని అన్నారు. పరీక్ష తేదీ పొడిగించిన ఆ 45 రోజులు మరింత కష్టంగా మారిందని, ఇంకెంత శక్తి మిగిలి ఉందో అనిపించేదని ఆమె గుర్తుచేసుకున్నారు. అయితే తన తల్లిదండ్రులు రోజుకో గంట వ్యాయామం, బాస్కెట్‌బాల్ ఆడటం వంటి వాటికి కేటాయించాలని చెప్పడం వల్లే తాను డిప్రెషన్‌లోకి వెళ్లకుండా మానసిక ప్రశాంతతను కాపాడుకోగలిగానని తెలిపారు. ఎంబీబీఎస్ పూర్తి చేసిన తర్వాత మిస్ వరల్డ్ 2017 కిరీటాన్ని గెలుచుకున్న మానుషి, ఆ తర్వాత అనూహ్యంగా సినిమాల్లోకి ప్రవేశించారు. 'సమ్రాట్ పృథ్వీరాజ్' చిత్రంతో బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన ఆమె, ఆ తర్వాత 'ది గ్రేట్ ఇండియన్ ఫ్యామిలీ', 'ఆపరేషన్ వాలెంటైన్' వంటి చిత్రాలతో నటిగా గుర్తింపు తెచ్చుకున్నారు.

# రజనీకాంత్ నుంచి రాశీ ఖన్నాకు స్పెషల్ గిఫ్ట్..

### -తలైవా సర్‌ప్రైజ్‌తో ఎమోషనల్ అయిన హీరోయిన్!




సూపర్ స్టార్ రజనీకాంత్‌తో కలిసి నటించే అవకాశం రావడం ఏ నటుడికైనా, నటికైనా ప్రత్యేకమైన అనుభవమే. అలాంటి అవకాశం దక్కిన హీరోయిన్ రాశీ ఖన్నాకు షూటింగ్ ప్రారంభమైన కొద్ది రోజులకే తలైవా నుంచి ఊహించని బహుమతి అందింది. రజనీకాంత్ స్వయంగా ఓ ఆధ్యాత్మిక పుస్తకాన్ని ఆమెకు కానుకగా ఇవ్వడంతో రాశీ ఖన్నా ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఈ విషయాన్ని ఆమె సోషల్ మీడియా ద్వారా అభిమానులతో పంచుకోవడంతో ప్రస్తుతం ఈ వార్త వైరల్‌గా మారింది. ప్రస్తుతం రజనీకాంత్ హీరోగా దర్శకుడు అశ్వత్ మారిముత్తు తెరకెక్కిస్తున్న 'ధర్మన్ – – ది డెడ్లీ డాక్టర్' చిత్రంలో రాశీ ఖన్నా కీలక పాత్రలో నటిస్తున్నారు. షూటింగ్ సందర్భంగా ఇద్దరి మధ్య ఆధ్యాత్మికత, జీవన విలువలపై ఆసక్తికర చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ఆ సమయంలో రజనీకాంత్ ప్రముఖ ఆధ్యాత్మిక గ్రంథం 'హఴజఴఅస్త్ర ఏఴ్ష్ప్ర్ ష్ప్రవ ఎఴఏుఖ్రీుఖ్ఖుఖఅ మీుర్వతీం' గురించి ప్రస్తావించారు. తాను ఇప్పటివరకు ఆ పుస్తకాన్ని చదవలేదని రాశీ చెప్పగా, రెండు రోజుల వ్యవధిలోనే ఆ పుస్తకాన్ని తెప్పించి స్వయంగా ఆమెకు బహుమతిగా అందించినట్లు సమాచారం. రజనీకాంత్ నుంచి ఈ ప్రత్యేక కానుక అందుకోవడంపై రాశీ ఖన్నా సోషల్ మీడియాలో భావోద్వేగంగా స్పందించారు. ఇది కేవలం ఒక పుస్తకం మాత్రమే కాదు... నా జీవితానికి ఒక నిశ్శబ్దమైన మార్గదర్శకం అంటూ ఆమె పేర్కొన్నారు. కొన్నిసార్లు పరిణతి అంటే కొత్తగా ఏదైనా సాధించడం కాదు.. మనం కాని వ్యక్తిగా నటించడం మానేసి, మన నిజమైన స్వరూపాన్ని అంగీకరించడం అనే భావాన్ని ప్రతిబింబించే కోట్‌ను కూడా ఆమె షేర్ చేశారు. స్తకం పూర్తిగా చదివానో లేదో తర్వాత పరీక్ష పెడతానని రజనీ సార్ చెప్పారు. అందుకే చాలా శ్రద్ధగా చదువుతున్నాను అంటూ అభిమానులతో ఆ అనుభవాన్ని పంచుకున్నారు. రజనీకాంత్ నటిస్తున్న 'ధర్మన్ -- ది డెడ్లీ డాక్టర్' చిత్రాన్ని ప్రముఖ నటుడు కమల్ హాసన్ తన రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్లు ఇప్పటికే మంచి స్పందనను అందుకున్నాయి. రజనీకాంత్ కొత్త లుక్, కథాంశంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రాన్ని 2027లో ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని చిత్ర బృందం సన్నాహాలు చేస్తోంది. రజనీకాంత్ లాంటి దిగ్గజ నటుడు తనపై చూపిన ఆప్యాయత, ఆధ్యాత్మిక పుస్తకాన్ని బహుమతిగా ఇవ్వడం తనకు జీవితాంతం గుర్తుండిపోయే అనుభవమని రాశీ ఖన్నా చెప్పడంతో, అభిమానులు తలైవా గొప్ప మనసును మరోసారి ప్రశంసిస్తున్నారు. ప్రస్తుతం రాశీ షేర్ చేసిన ఈ పోస్ట్ సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది.

# ఇండియన్ బాక్సాఫీస్ వద్ద 'స్పైడర్ మ్యాన్' హవా

### -రెండు రోజుల్లో రూ.131 కోట్లు..




హాలీవుడ్ స్టార్ హీరో టామ్ హాలండ్ ప్రధాన పాత్రలో నటించిన లేటెస్ట్ సూపర్ హీరో మూవీ 'స్పైడర్ మ్యాన్: బ్రాండ్ నివ్ డే' బాక్సాఫీస్ వద్ద సంచలనాలు సృష్టిస్తోంది. డెస్టిన్ డేనియల్ క్రీటన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో జెండాయా, జాకబ్ బటాలాన్, సాడీ సింక్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ప్రపంచవ్యాప్త విడుదలకు ముందే భారత్‌లో గురువారమే విడుదలైన ఈ సినిమా, కేవలం రెండు రోజుల్లోనే రూ. 100 కోట్లకు పైగా వసూళ్లను సాధించి అదరగొట్టింది. చిత్ర నిర్మాత ప్రకటించిన నివేదిక ప్రకారం.. ఈ సినిమా మొదటి రోజు రూ. 72.44 కోట్ల గ్రాస్ కలెక్షన్లను రాబట్టగా, రెండో రోజు రూ. 59.02 కోట్లు వసూలు చేసింది. దీంతో మొత్తంగా భారత్ బాక్సాఫీస్ వద్ద ఈ చిత్రం రూ. 131.46 కోట్ల గ్రాస్ కలెక్షన్ల మైలురాయిని దాటింది. ఇంగ్లీష్‌తో పాటు హిందీ, తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో 2డి, 3డి ఫార్మాట్లలో విడుదలైన ఈ చిత్రానికి అన్ని ప్రాంతాల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోంది.